RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగు దినపత్రిక | సంపుటి :02 | సంచిక : 195 | మంగళవారం 01 జూలై 2025 | పేజీలు: 08 | వెల రూ.5

PUBLISHED FROM : KARIMNAGAR : CIRCULATED TO : ADILABAD, WARANGAL, NIZAMABAD, WARANGAL,HYDERABAD,KHAMAM, NALGONDA, MAHBUBNAGAR,MEDAK, RANGAREDDY

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
శెనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.
PRESS
97051 46268 77805 51339
98491 98098

# పేలిన బతుకులు..

సిగాచి ప్రమాదంలో 12 మంది మృతి





2

- కెమికల్ ఫ్యాక్టరీలో విస్ఫోటనం
- సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో ఘటన
- పేలుడు ధాటికి కుప్పకూలిన భవనాలు
- 100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డ కార్మికులు
- చుట్టూ ఉన్న భవనాలకూ అంటుకున్న మంటలు
- ఉదయం షిఫ్ట్కు వచ్చిన వారంతా మంటల్లోనే
- దాదాపు 60 మంది సురక్షితంగా బయటకు
- తీవ్రంగా గాయపడిన వారిని హాస్పిటల్ కు తరలింపు
- ప్రమాద స్థలాన్ని పరిశీలించి కలెక్టర్, ఎస్పీ
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ , సీఎం రేవంత్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్



## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు

- నేడు అధికారికంగా ప్రకటన
- విధేయత, సీనియారిటీకి ప్రాధాన్యం

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఉత్కంఠకు తెరపడింది. మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావును పార్టీ అధిష్ఠానం రాష్ట్ర అధ్యక్షుడిగా ఖరారు చేసింది. ఈ మేరకు ఆయన సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు.రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కె. లక్ష్మణ్, రామచందర్ రావు పేర్లు చర్చలో ఉన్నప్పటికీ, చివరకు రామచందర్ రావు పేరునే ఖరారు చేశారు. ఆరెస్సెస్ తో పాటు సీనియర్ నేతలు కూడా ఆయనను బలంగా సూచించినట్లు సమాచారం. కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం, బలమైన స్థానిక మద్దతు, పార్టీని బలోపేతం చేయడం వంటి అంశాలన్నింటినీ పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రామచందర్ రావు గత 40 ఏళ్లుగా వివిధ స్థాయిలలో పార్టీకి సేవ చేశారు. విద్యార్థి పరిషత్ నుంచి లాయర్‌గా, పార్టీ నేతగా, ఎమ్మెల్సీగా ఆయన కొనసాగారు. పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. అందుకే అగ్రనేతలు ఆయనను రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ, "అందరినీ కలుపుకుని ముందుకు తీసుకెళ్తాను. బీజేపీలో ఆధిపత్య పోరు లేదు. వివాద రహితంగా నాకు అవకాశం ఇచ్చింది అధిష్ఠానం. 40 ఏళ్లుగా చేసిన సేవను గుర్తించింది," అని అన్నారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రామచందర్ రావు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీ నారాయణ మిగతా 2వ పేజీలో..

## మీకో దండం... మీ పార్టీకో దండం
## బీజేపీకి గుడ్ బై

- పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల వేళ...
- రాజాసింగ్ షాకింగ్ నిర్ణయం
- కమలం పార్టీకి గోషామహల్ ఎమ్మెల్యే రాజీనామా
- కిషన్ రెడ్డికి రాజీనామా లేఖ అందజేత

2



## లొంగుబాటలో మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి దామోదర్?

**శెనార్తి మీడియా, ప్రత్యేక ప్రతినిధి:**

కేంద్ర బలగాల ఉక్కుపాదాలకు తట్టుకోలేక మావోయిస్టు పార్టీ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లింది. ఒకరి తర్వాత ఒకరు కీలక నేతలు భద్రతా బలగాలదే గురి అవుతున్నారు. ఎంత దట్టమైన అటవీ ప్రాంతమైనా సెంట్రల్ ఫోర్స్‌లు చొచ్చుకెళ్తున్నాయి. ఇప్పటికే కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావును కోల్పోయిన పార్టీ, ఇతర పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులనూ కొంత కొంతగా కోల్పోతూ వస్తోంది. రాష్ట్ర మావోయిస్టు పార్టీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా ఈ పరిణామాల్లో లొంగుబాటులోకి వెళ్లబోతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.



ములుగు జిల్లాకు చెందిన తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన దామోదర్, ఇంటర్ చదువుతున్నప్పుడు మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై పార్టీకి చేరాడు. అతనిపై 70కి పైగా కేసులు నమోదై ఉండగా, ₹50 లక్షల రివార్డ్ కూడా ఉంది. 2021లో అప్పటి కార్యదర్శి హరిభూషణ్ కోవిడ్‌తో మృతి చెందటంతో చొక్కారావు ఆ స్థానాన్ని భర్తీ చేశాడు. దామోదర్ సైనిక వ్యూహాల్లో, మెరుపుదాడుల్లో నిపుణుడుగా పేరొందాడు. ఆయన అన్నలు మురళి, నాగేశ్వరరావు ఇద్దరూ మావోయిస్టు పార్టీకి సేవలందించారు, అయితే ఎదురు మిగతా 2వ పేజీలో..



## బీసీలకు 42% రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు

2

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కవిత విమర్శలు
- 17న రైల్ రోకో కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరణ

## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్

2

## ఉచిత బస్సు పొందిన 191 కోట్ల మంది మహిళలు

- వారి ప్రయాణం విలువ రూ.6,300 కోట్లు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

2

మీకో దండం... మీ పార్టీకో దండం

# బీజేపీకి గుడ్ బై

* పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల వేళ... రాజాసింగ్ షాకింగ్ నిర్ణయం
* కమలం పార్టీకి గోషామహల్ ఎమ్మెల్యే రాజీనామా
* కిషన్ రెడ్డికి రాజీనామా లేఖ అందజేత

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**

పార్టీపై కొంతకాలంగా విమర్శలు చేస్తూ వచ్చిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చివరకు బీజేపీకి రాజీనామా చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఈ సంచలన పరిణామం చోటు చేసుకుంది. సోమవారం రాజాసింగ్ తన రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి అందజేశారు. తరువాత విలేకరులతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడానికి వెళ్లితే తాను ఎదుర్కొన్న అవమానాన్ని వివరించారు. నామినేషన్ వేసే ప్రయత్నంలో తనను అడ్డుకోవడం, అనుచరులను బెదిరించడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. "మీకో దండం, మీ పార్టీకో దండం" అంటూ బీజేపీకి గుడ్ బై చెప్పారు.2014 నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని, టెర్రరిస్టుల హిట్ లిస్టులో ఉన్నానని గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకుండా చూసేందుకు కొందరు నేతలు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తన అనుచరులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించినందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. రాజాసింగ్ తన నామినేషన్ కోసం పది మంది మద్దతుదారులు సిద్ధంగా ఉన్నా, సంతకాలు చేయనివ్వలేదని వాపోయారు. రామచందర్ రావుకు పదవి ఇవ్వడంపై కార్యకర్తల్లో అసంతృప్తి ఉందని, తన విషయంలో లక్షలాది మంది కార్యకర్తలు బాధపడుతున్నారని అన్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవి ఎవరికి ఇవ్వాలో ముందే నిర్ణయించినట్టు, తనను అడ్డుకోవడానికి కుట్ర జరిగిందని ఆరోపించారు. పార్టీకి రాజీనామా చేసినా, హిందుత్వం కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.మరోవైపు, కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ రాజాసింగ్‌ను కలుసుకుని మరోసారి ఆలోచించమని సూచించారు. అయితే, ఇప్పటికే నిర్ణయం తీసుకున్నానని, పునరాలోచన అవసరం లేదని రాజాసింగ్ స్పష్టంగా బండి సంజయ్‌కు తెలిపారు.తాజా పరిణామాల మధ్య రామచందర్ రావును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖరారు చేసినట్టు సమాచారం. మంగళవారం ఆయన పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది

## నేటి నుంచి పెరిగిన రైల్వే ఛార్జీల అమలు

* తత్కాల్ బుకింగ్‌కు ఆధార్ తప్పనిసరి

**న్యూఢిల్లీ,జూన్ 30 :**

కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్‌బుకింగ్‌లో నిబంధనల అమలుపై రైల్వేబోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్ బుకింగ్‌లు అమలులోకి వస్తాయని తెలిపింది. జూలై 1నుంచి ఈ మార్పులు అమలు కానున్నాయని ఇప్పటికే ప్రకటించింది. తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేసిన రైల్వేశాఖ.. జులై 1 నుంచి అమలులోకి తీసుకుని రావాలంటూ అన్ని జోన్‌ల మేనేజర్లకు సర్క్యులర్ జారీ చేసింది. దీంతో అర్ధరాత్రి 12గంటల నుంచి పెంచిన రైల్వే ఛార్జీలు అమలులోకి రానున్నాయి. సెకండ్ క్లాస్ ఆర్డినరీకి 500కి.మీ వరకు సాధారణ ఛార్జీలే ఉండనున్నాయి. 501 కి.మీ నుంచి 1500 కి.మీ వరకు టికెట్‌పై రూ.5□ 201 కి.మీ నుంచి 2500 కి.మీ వరకు టికెట్‌పై రూ.10□ 2501 నుంచి 3వేల కి.మీ వరకు టికెట్‌పై రూ.15 చొప్పున పెంచారు. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఆర్డినరీ టికెట్లపై కి.మీకు అరపైసా చొప్పున పెంచగా.. మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్ ఏసీ) రైళ్లలో టికెట్లపై నాన్ ఏసీ ఫస్ట్, సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్ టికెట్లపై కి.మీకు ఒక పైసా చొప్పున పెంచారు. అలాగే, అన్ని రకాల రైళ్లలో ఏసీ అన్ని తరగతులకు కి.మీకు 2పైసలు చొప్పున పెంచుతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. రిజర్వేషన్ ఛార్జ్, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీల్లో మాత్రం మార్పు ఉండదని స్పష్టం చేసింది. ఇప్పటికే రిజర్వేషన్ చేసిన టికెట్లకు పెంచిన ఛార్జీలు అమలు కావని తెలిపింది.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు

* కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కవిత విమర్శలు
* 17న రైల్ రోకో కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరణ


**హైదరాబాద్,జూన్ 30:**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జూలై 17న రైల్ రోకో నిర్వహించిన తీరుతామని తేల్చిచెప్పారు. సోమవారం తన నివాసంలో సింగరేణి జాగృతి రూపొందించిన రైల్ రోకో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిసి సమాజం, తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు వేర్వేరు బిల్లులు పాస్ చేసిందని గుర్తు చేశారు. ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించేందుకు వెంటనే ఢల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకే తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో జూలై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన రైల్ రోకో చేసి తీరుతామని తెలిపారు. రైల్ రోకోకు సింగరేణి జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని వెల్లడిరచారు. బిసిల రిజర్వేషన్ల పెంపు, రైల్ రోకో అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. జూలై 16, 17, 18 తేదీల్లో ఎవరూ ప్రయాణాలు పెట్టుకోవద్దని ఎంఎల్‌సి కవిత మరోసారి విజ్ఞప్తి చేశారు. □ంగరేణి కాలరీస్ సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వాలని ఎంఎల్‌సి కవిత డిమాండ్ చేశారు. సింగరేణిలో పని చేస్తున్న కార్మికులు సర్వేయర్ కోర్సు పూర్తి చేసి డిజిఎంఎస్ నుంచి సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి సర్వేయర్ కోర్సు పూర్తి చేసిన వారి కోసం నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

## ఉచిత బస్సు పొందిన 191 కోట్ల మంది మహిళలు

* వారి ప్రయాణం విలువ రూ.6,300 కోట్లు
* మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్,జూన్ 30:**



హైదరాబాద్ నగరంలో కొత్తకాలనీలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా కొత్త రూట్లలో ప్రయాణికుల సౌకర్యాలు పెంచేలా ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సర్వీసులు నడిపేందుకు ఆర్టీసి సిద్దంగా ఉందన్నారు. ఒకే రూట్‌లో వెళ్లే వారుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వారికి ప్రత్యేక బస్సులు వేస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు 191 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, వారి ప్రయాణం విలువ రూ.6,300 కోట్లు ఉంటుందని మంత్రి తెలిపారు. ముషీరాబాద్‌లో పదవీవిరమణ పొందుతున్న 14మంది ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వారి సేవల్ని కొనియాడారు. అంతకుముందు అధునాతన టెక్నాలజీ ద్వారా ఆర్టీసీ అమలు చేస్తోన్న డిజిటల్ పేమెంట్స్ అమలును మంత్రి పొన్నం పరిశీలించారు. రవాణా శాఖ చెక్‌పోస్టుల మూసివేత అంశం కేంద్రం ప్రతిపాదనలో ఉందని, దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఈవీ పాలసీ తీసుకొచ్చిందని, రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టులు సాంకేతికంగా అమలు చేసేలా మార్పులు చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో అనేక సంస్కరణలు, ఆర్టీసీ ఉద్యోగులకు సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ పాత బకాయిలు చెల్లిస్తూ, నూతన నియామకాలు చేపట్టామని, కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని వివరించారు.

# పేలిన బతుకులు..



* కెమికల్ ఫ్యాక్టరీలో విస్ఫోటనం
* సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో ఘటన
* సిగాచి ప్రమాదంలో12 మంది మృతి
* పేలుడు ధాటికి కుప్పకూలిన భవనాలు
* 100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డ కార్మికులు
* చుట్టూ ఉన్న భవనాలకూ అంటుకున్న మంటలు
* ఉదయం షిఫ్ట్కు వచ్చిన వారంతా మంటల్లోనే
* దాదాపు 60 మంది సురక్షితంగా బయటకు
* తీవ్రంగా గాయపడిన వారిని హాస్పిటల్ కు తరలింపు
* ప్రమాద స్థలాన్ని పరిశీలించి కలెక్టర్, ఎస్పీ
* దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ , సీఎం రేవంత్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్

**శెనార్తి మీడియా, హైదరాబాద్/సంగారెడ్డి:**

సంగారెడ్డి జిల్లా పఠాన్చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం భారీ సంభవించింది. ఈ ప్రమాదంలో 12 మంది మృతిచెందగా.. మరో 15 మందికిపైగా తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులను వెంటనే పలు ఆస్పత్రులకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు పరిశ్రమలో మంటలు ఎగసిపడుతున్నాయి. పేలుడు ధాటికి కార్మికులు ఎగిరిపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు చెబుతున్నారు. పలువురు కార్మికులు మంటల్లో చిక్కుకున్నారు. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. రియాక్టర్ పేలడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.

ఈ ప్రమాదంతో స్థానికులు, కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సిగాచి కెమికల్స్ ఫ్యాక్టరీ పరిసరాల్లో దట్టమైన పొగ అలుముకుంది. ఘాటైన వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో చుట్టుపక్కల వారిని అధికారులు ఖాళీ చేయించారు. ఘటనాస్థలికి ఎవరూ రావొద్దని అధికారులు సూచించారు. పేలుడు ధాటికి పరిశ్రమ భవనం కుప్పకూలాగా, మరో భవనానికి బీటలు పడ్డాయి. ఫ్యాక్టరీలో ఒడిశా, ఇతర రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారు. వారినీ అక్కడి నుంచి దూరంగా పంపించి వేస్తున్నారు. పోలీసులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, హైడ్రా, రెవెన్యూ అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సహాయ చర్యలను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. సంఘటన స్థలానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, పఠాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మల్టీజోన్2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ పరితోష్ పంకజ్ చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### సీఎం రేవంత్రెడ్డి కీలక ఆదేశాలు

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం రేవంత్రెడ్డి ఆదేశించారు.

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: హరీష్రావు

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం జరిగి కార్మికులు అందులో చిక్కుకోవడం అత్యంత విషాదకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్రావు అన్నారు. కార్మికులు, సిబ్బందిని కాపాడేందుకు అవసరమైన అన్నిచర్యలు వెంటనే చేపట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీష్రావు కోరారు.

పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు సంభవించిందని మాజీ మంత్రి హరీష్రావు అన్నారు. భూమి కంపించేంత శబ్దం వచ్చిందని చెప్పుకొచ్చారు. 149మంది వరకు ఈ పరిశ్రమలో ఉదయం పని చేశారని వెల్లడించారు. ఈ ప్రమాదంలో నాలుగు అంతస్థుల భవనం కుప్పకూలిందని.. 8మంది చనిపోయారని అన్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. బిహార్, చత్తీస్ఘడ్తోపాటు తెలుగు వాళ్లూ ఈ పరిశ్రమలో పనిచేస్తున్నారని వెల్లడించారు. పరిశ్రమలో పనిచేసే వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని మాజీ మంత్రి హరీష్రావు అన్నారు.

ఉదయం తొమ్మిది గంటలకు ఈ ప్రమాదం జరిగితే సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వహించారని మాజీ మంత్రి హరీష్రావు మండిపడ్డారు. ఈ ఘటనపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రమాదంపై చాలా నిర్లక్ష్యంగా ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ఎంతమంది చనిపోయారో అనేది ఇంకా క్లారిటీ లేదన్నారు. డ్యూటీలో ఎంతమంది ఉన్నారో ఒక్కొక్క అధికారి ఒక్కొక్క డేటా చెబుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర దు:ఖంతో ఉన్నారని అన్నారు. లోపల పనిచేసే కార్మికులు 60 నుంచి 70 శాతం వరకు కాలిపోయారని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స అందిస్తే ప్రాణాలు దక్కేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షలు ఏక్స్గ్రేషియా ఇవ్వాలని మాజీ మంత్రి హరీష్రావు డిమాండ్ చేశారు.

### ప్రధాని మోదీ సహా ప్రముఖుల విచారం

పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పలువురు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. రసాయనిక పరిశ్రమలో రియాక్టర్ పేలి కార్మికులు మృతిచెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే పీఎం ఆర్ఎఫ్ ఫండ్ నుంచి మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రధాని మోదీ ఎక్స్గ్రేషియా ప్రకటించారు.

### ప్రమాదంపై ప్రధాని మోదీ ట్వీట్

'తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డిలో ఒక కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా అందిస్తాము' అని ప్రధాని మోదీ ప్రకటించారు.

### ప్రమాదంపై పవన్ ఆవేదన


తెలంగాణ రాష్ట్రంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదనకు లోనయ్యాను. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడం మూలంగా చోటు చేసుకున్న ఈ పరిశ్రమలో గాయపడ్డవారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారికీ, ఇతర క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను' అంటూ డిప్యూటీ సీఎం పవన్ ట్వీట్ చేశారు.

### దిగ్భ్రాంతికి గురిచేసింది: మంత్రి లోకేష్

తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో 8 మంది మృతి చెందిన విషయం దిగ్భ్రాంతి కలిగించింది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడిన వార్త ఆందోళనకు గురిచేసింది. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

### పాశమైలారం ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

సంగారెడ్డి జిల్లా పాశమైలారం రియాక్టర్ పేలుడు ఘటనలో పలువురు మృతి చెందడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటన జరగటం అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలన్న వైఎస్ జగన్.. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడ పాశమైలారంలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. సిగాచి కెమికల్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలింది. పేలుడు ధాటికి కంపెనీకి సంబంధించిన అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ సహా చాలా భాగం దెబ్బతింది. ఘోర ప్రమాదంలో మృతుల సంఖ్య భారీగా పెరిగేలా కనిపిస్తోంది. షిఫ్ట్‌లో 150 మంది కార్మికులు ఉండగా.. ప్రమాదం జరిగిన బ్లాక్‌లోనే 90 మంది దాకా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం.. మృతుల సంఖ్య 14కి చేరింది. కంపెనీ మేనేజర్ ఒకరు సైతం మృతి చెందినట్లు సమాచారం.





## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

* టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**

నక్సల్స్‌కు కాంగ్రెస్ ప్రోత్సాహం ఇచ్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా మండిపడ్డారు. శాంతి భద్రతలు, జాతీయ భద్రత విషయాల్లో కాంగ్రెస్ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో మాట్లాడుతూ... "నక్సల్స్‌తో చర్చలు జరపాలన్నది ఆపరేషన్ కగార్ సందర్భంలో తీసుకున్న శాంతిపూరిత నెరుపుదారిలో భాగమే. దీన్ని నక్సలైట్లకు మద్దతుగా చెప్పడం అమిత్ షా అజ్ఞానాన్ని ప్రతిబింబిస్తుంది" అని వ్యాఖ్యానించారు. టెర్రరిస్ట్‌లపై బీజేపీ తీసుకున్న తీరును ప్రజలు మరిచిపోలేరని, ట్రంప్ సూచనతో పాక్‌పై యుద్ధం మానుకున్నారని విమర్శించారు. "మా దేశపౌరులు లెఫ్ట్ ఉద్యమాల్లో ఉంటే వారితో చర్చలు జరపడం తప్పా? బీజేపీ ప్రభుత్వం తలపోని స్థాయిలో మోసగాళ్లకు, దేశద్రోహులకు వెన్నుదన్నుగా ఉండింది," అన్నారు మహేశ్. మరోవైపు, కేంద్రంలో కొనసాగుతున్న ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చైతన్యం సృష్టించేందుకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే జూలై 4న తెలంగాణను సందర్శించనున్నట్లు తెలిపారు. ఆదే రోజున ఎల్బీ స్టేడియంలో గ్రామస్థాయి కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనం జరగనుంది. గ్రామ శాఖల నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు దాదాపు 25 వేల మంది కార్యకర్తలు ఈ సభకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సభ ఏర్పాట్లను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిట శ్రీహరి, సీఎంసలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు సోమవారం పరిశీలించారు.

## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు

మొదటి పేజీ తరువాయి

స్వీకరించారు. మంగళవారం ఆయన పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఇక గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఈ నియామకంపై స్పందిస్తూ, "అధ్యక్షుడిని బూత్ కార్యకర్తల నుంచి ముఖ్య నేతల వరకు ఓటు వేసి ఎన్నుకోవాలి. నామినేషన్ ప్రక్రియను ప్రజల ముందు ఉంచాలి. 'నావాడు, నీవాడు' అంటూ నియమించుకుంటే పార్టీకి నష్టం," అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే నేతల ఎంపికకు ప్రత్యక్ష ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

## లొంగుబాటలో మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి దామోదర్?

మొదటి పేజీ తరువాయి

కాల్పుల్లో మరణించారు. దామోదర్ మేనకోడలు నాగజ్యోతి ములుగు జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ కావడం గమనార్హం. ఇప్పుడు దామోదర్ 55 ఏళ్ల వయసులో అనారోగ్యం, భద్రతా బలగాల ఒత్తిడి, పార్టీలోని అంతర్గత విభేదాల నేపథ్యంలో లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నట్టు గత పదిహేను రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రక్రియలో ఆయన కుటుంబ సభ్యులు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఒక ముఖ్య నేతతో చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. దాంతో, రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాల భవిష్యత్తు దిశగా ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

# కర్ణాటక సీఎం మార్పు హైకమాండ్‌చూసుకుంటుంది: ఖర్గే

**శెనార్తి మీడియా, బెంగళూరు:**



కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు జరుగనుందన్న ప్రచారాల నేపథ్యంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ముఖ్యమంత్రి మార్పు అంశం పూర్తిగా పార్టీ హైకమాండ్ పరిధి లోనిదని స్పష్టంచేశారు. ఈ విషయంపై పార్టీ అత్యున్నత నాయకత్వమే నిర్ణయం తీసుకుంటుందన్నారు.రాజధాని బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి మార్పుపై హైకమాండ్‌లో ఏం జరుగుతుందన్నది ఎవరూ ముందుగానే చెప్పలేరన్నారు. ఇది పూర్తిగా హైకమాండ్ నిర్ణయం మేరకే జరుగుతుందని ఖర్గే తెలిపారు. ఈ అంశాన్ని అనవసరంగా వాదనలు, ఊహాగానాలు రేపకూడదన్నారు. ఇటీవల డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిగా నియమించబోతున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదే నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌ఏ ఇక్బాల్ హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మరో రెండు మూడు నెలల్లో డీకే శివకుమార్ సీఎం పదవిని స్వీకరిస్తారని హుస్సేన్ వెల్లడించడంతో కీలక పరిణామాలకు దారి తీయవచ్చన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇక్బాల్ హుస్సేన్ ప్రకారం, కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో శివకుమార్ పాత్ర కీలకమని, ఇప్పుడు హైకమాండ్ కూడా అదే దిశగా ఆలోచిస్తున్నదని చెప్పారు. ఆయన వ్యాఖ్యలు శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న నేత వాఖ్యలుగా మరింత ప్రాధాన్యం సంపాదించాయి.

# పరాకాష్టకు రాజాసింగ్ క్రమశిక్షణారాహిత్యం

- **పోటీకి సరైన రీతిలో పత్రాలు సమర్పించకుండా యాగీ**
- **రాజీనామా చేయాలనుకుంటే స్పీకర్‌కు సమర్పించాలి**
- **తెలంగాణ బీజేపీ ప్రకటన**

**హైదరాబాద్,జూన్ 30 :** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ క్రమశిక్షణారాహిత్యం పరాకాష్టకు చేరిందని తెలంగాణ బీజేపీ పార్టీ కీలక ప్రకటన చేసింది. రాజాసింగ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకుంటే స్పీకర్ కు రాజీనామా లేఖ సమర్పించాలని, పార్టీకంటే ఎక్కువ ఎవరూ కాదని బీజేపీ పార్టీ పేర్కొంది. రాష్ట్ర పార్టీ అధ్యక్ష ఎన్నికలలో రాజాసింగ్ కూడా నామినేషన్ వేస్తానని పార్టీ కార్యాలయానికి వచ్చారని తెలిపింది. ఆ సమయంలో ఈ విషయమై జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ అభయ్ పాటిల్ రాజాసింగ్ చర్చించారు. ఇక రాజాసింగ్ కోరిక మేరకు నామినేషన్ పత్రాలు ఇచ్చి నామినేషన్ వేసుకునే అవకాశం ఇచ్చారని తెలిపింది. అలాగే రాష్ట్ర ఎన్నికల అధికార శోభా కరండ్లాజేకి 10 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల మద్దతుతో నామినేషన్ ఫామ్ సమర్పించవలిసి ఉండగా, వారు కేవలం ముగ్గురు సభ్యుల సంతకాలతో ఉన్న ఫామ్ మాత్రమే సమర్పించి నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధన ప్రకారం.. రాష్ట్ర అధ్యక్షుని ఎన్నికలలో పోటీ చేయడానికి 10 మంది స్టేట్ కౌన్సిల్ సభ్యుల సంతకాలతో మరో ఫామ్ సమర్పించవలిసిందిగా శ్రీమతి శోభా కరండ్లాజే రాజాసింగ్ కోరారు. అయితే, రాజాసింగ్ నామినేషన్ కి మద్దతిచ్చే స్టేట్ కౌన్సిల్ సభ్యులు లేక చేతులెత్తేసి పార్టీ పోటీ చేయనివ్వట్లేదని అబద్దాలతో పార్టీపై అభాండాలు వేస్తున్నట్లు తెలిపింది. పార్టీ అధ్యక్షులు కిషన్ రెడ్డికి సమర్పించిన రాజీనామా పత్రాన్ని ఆయన జాతీయ అధ్యక్షుడికి పంపించడం జరుగుతుందని తెలిపింది. గతంలో కూడా ఇలాంటి క్రమశిక్షణా రాహిత్య వ్యవహారాలతో సస్పెండ్ అయితే మళ్లీ పార్టీలోకి తీసుకున్నామని.. ప్రధానమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు వారి నియోజకవర్గానికి వచ్చినా సరే వారి కార్యక్రమాలకు హాజరుకాకుండా పార్టీ కంటే తానే సుప్రీం అన్నట్లుగా రాజాసింగ్ వ్యవహారం ఉందని పార్టీ తెలిపింది. మా పార్టీకి వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యం. పార్టీ క్రమశిక్షణను అనేకసార్లు రాజాసింగ్ ఉల్లంఘించినట్లు తెలిపింది. చివరకు ఈరోజు వారే రాజీనామా చేసారని పార్టీ ప్రకటించింది.

# కేసీఆర్ డైరెక్షన్‌లో బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక

- **స్థానిక ఎన్నికల్లో టానిక్ ఎక్కించే యత్నం**
- **ప్రభుత్వ విప్ బిర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్,జూన్ 30 :**

బీజేపీ అధ్యక్షుడి ఎంపికపై బీఆర్ఎస్, బీజేపీ మైత్రి మరోసారి బయట పడిరదంటూ ప్రభుత్వ విప్ బిర్ల ఐలయ్య తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త వివాదానికి తెరలేపుతూ ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకే బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక జరిగిందని ఆయన మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నిక ల్లో బీఆర్ఎస్ బీజేపీకి 'అవయవ దానం' చేసిందని వ్యాఖ్యానించారు. తాజాగా రాష్ట్ర బీజేపీ అధ్య క్షుడిగా రామచందర్ రావు లాం టి బలహీన వ్యక్తిని నియమించడం కూడా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సాయం చేసే వ్యూహం భాగమని తెలిపారు. ఈ పక్రియ మొత్తం కేసీఆర్ డైరెక్షన్‌లో జరిగిందని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీ వర్గాలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని బిర్ల ఐలయ్య విమర్శించారు. గతంలో ఎన్నికల ముందు బండి సంజయ్ ను బీజేపీ అధ్యక్ష పదవి నుండి తప్పించడమూ, ఇప్పుడు మళ్లీ బీసీలకు కాకుండా అగ్రవర్ణాల నేతకు పదవి కట్టబెట్టడమూ దానికి ఉదాహరణలని అన్నారు. కేటీఆర్, హరీష్ రావు లు ఢల్లీలో అర్ధరాత్రి బీజేపీ నేతలతో సమావేశాలు జరిపి అగ్రవర్ణాల నేతను అధ్యక్షుడిగా నియమించేలా లాబీ చేసినట్లు బిర్ల ఐలయ్య ఆరోపించారు. ఈ చర్యలన్నీ బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందాన్ని బలపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఇక రాష్ట్ర బీజేపీ పార్టీలోని కీలక వ్యక్తి రాజసింగ్ కూడా బీజేపీకి రాజీనామా చేయడాన్ని బిర్ల ఐలయ్య ప్రస్తావించారు. ఇది బీజేపీ ఆత్మ స్థితిగతులపై ప్రజలకు సంకేతం ఇచ్చే విషయమని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రాణం పోసేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు.

# సీఎస్ నేతృత్వంలో సహాయక చర్యల కమిటీ

- **నేడు ఘటనా స్థలానికి సి ఎం రేవంత్**

**హైదరాబాద్ ,జూన్ 30 :** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర ప్రమాద ఘటనపై ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు ఆరా తీసారు. సంఘటనా స్థలాన్ని మంగళ వారం సందర్శించనున్నారు. ఈ క్రమం లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలో సహాయక చర్యల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో సభ్యులుగా డీఆర్ఎఫ్ స్పెషల్ సీఎస్, కార్మిక శాఖ సీఎస్‌ను నియమించారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను కమిటీ సిఫార్సు చేయనుంది. మరోవైపు క్షేత్రస్థాయిలో జరుగుతున్న సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సీఎం ఆరాతీస్తున్నారు. తాజా పరిస్థితులను మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉదయం 10గంటలకు ఘటనాస్థలికి సీఎం వెళ్లనున్నారు.

# బీసీలంటేనే కాంగ్రెస్ పార్టీ

**హైదరాబాద్, జూన్ 30:** బీజేపీ పార్టీ బీసీల వ్యతిరేకని మరోసారి నిరూపించుకుందని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముగ్గురు బీసీ ఎంపీలు ఉన్నా.. అలాగే అనేకమంది బీసీ సీనియర్ నేతలు ఉన్నా సరే.., అలాగే బీజేపీ అధ్యక్షుడు కావడానికి అన్ని అర్హతలు ఉన్నవారికి అధ్యక్ష పదవి ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో బీసీ ముఖ్యమంత్రి చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి కనీసం సభాపక్ష నాయకుడుని కూడా బీసీలకు ఇవ్వలేదని ఆగ్రహించారు. తాజాగా మంత్రి బీసీల విషయమై స్పందిస్తూ.. బీసీల గురించి చర్చను లేవనెత్తారు. అంతే కాకుండా ఆయన బీజేపీ ఓ ఫ్యూడల్ పార్టీ అన్నారు. బీజేపీలో బీసీలకు ఎప్పుడూ న్యాయం జరగలేదు. బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వెయ్యనివ్వకుండా అడ్డుకొని నిరంకుశత్వంగా వ్యవహరించారని అన్నారుబీజేపీలో బీసీలకు అన్యాయం జరుగుతుందని మీ పార్టీ నాయకులే వాపోతున్నారు.. దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. ఇకపోతే, సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. బీసీల ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ.. ముఖ్యమంత్రి రెడ్డి ఉంటే, టీపీసీసీ అధ్యక్షుడిని బీసీని చేసుకున్నా మన్నారు.

# బనకచర్లకు అనుమతులు ఇవ్వలేం

- **పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించండి**
- **ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు ఉన్నాయి**
- **కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం**

**న్యూఢిల్లీ,జూన్ 30 :**

పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పును పరిశీలించాల్సి ఉందని తెలిపింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించడం అత్యవసరమని కమిటీ అభిప్రాయపడింది. బనకచర్ల ప్రాజెక్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టినట్లు ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నివేదికను నిపుణుల కమిటీ పరిశీలించింది. అయితే, 1983లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని అభిప్రాయపడింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వపై కేంద్రంతో అధ్యయనం, రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలకు అన్ని అనుమతులు, పర్యావరణ ప్రభావంపై అంచనా వేసిన తర్వాతే ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతివ్వడానికి సాధ్యమవుతుందని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను తిప్పిపంపింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది. సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబులిటీ అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్‌కు సూచించింది. కాగా, ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి చాలా ఫిర్యాదులు అందాయి. ఈ ప్రాజెక్టును మొదటి నుంచి తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. వెంటనే ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్రానికి ఫిర్యాదులు చేసింది. ఈ క్రమంలో బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఏపీ పంపిన ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ పరిశీలించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసిన కమిటీ.. అనుమతులు ఇవ్వడానికి తిరస్కరించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే గోదావరి ట్రిబ్యూనల్ తీర్పు పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతుల కోసం సీడబ్ల్యూసీని సంప్రదించడం తప్పనిసరని పేర్కొంది. బనకచర్ల ప్రాజెక్ట్ గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమంటూ అనేక ఫిర్యాదులు వచ్చాయని కమిటీ వెల్లడించింది.

# మరోమారు ప్రధాని మోడీ విదేశీ యానం

- **బ్రెజిల్ లో బ్రిక్స్ సదస్సుకు హాజరు**
- **2 నుంచి ఘనా తదితరు దేశాల్లో పర్యటన ఖరారు**

న్యూఢిల్లీ,జూన్ 30 : ప్రధాని నరేంద్ర మోదీ ఎనిమిది రోజుల పాటు ఐదు దేశాల్లో పర్యటించనున్నారు. జులై 2 నుంచి ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల్లో ఆయన పర్యటిస్తారని కేంద్ర విదేశాంగ శాఖలోని ఆర్థిక సంబంధాల కార్యదర్శి వెల్లడిరచారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా తొలుత జూలై 2, 3 తేదీల్లో ఘనాలో పర్యటిస్తారని తెలిపారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొనేందుకు బ్రెజిల్ వెళ్తున్న ప్రధాని.. ఈ నేపథ్యంలో గ్లోబల్ సౌత్‌లోని పలు కీలక దేశాలతో భారత్ సంబంధాలను విస్తరించడమే లక్ష్యంగా తన పర్యటన కొనసాగించనున్నారు. దీంతో గత 11 ఏళ్లలో మోదీ అత్యంత సుదీర్ఘమైన దౌత్య పర్యటనల్లో ఇదీ ఒకటి కానుంది. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షికి భాగస్వామ్యాన్ని సమీక్షించి.. ఆర్థిక, ఇంధన, రక్షణ సహకారంపై భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఉన్న అవకాశాలపై నేతలిద్దరూ చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. జులై 9 వరకు కొనసాగే ఎనిమిది రోజుల పర్యటనలో ప్రధాని రెండు ఖండాలను కవర్ చేయనున్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒకేసారి ఐదు దేశాల్లో పర్యటించడం ఇది రెండోసారి. 2016లో ఆయన అమెరికా, మెక్సికో, స్విట్జర్లాండ్, ఆఎౌగానిస్థాన్, ఖతార్‌లో ఒకేసారి పర్యటించారు. అలాగే, 2015 జులైలో ఆయన ఎనిమిది రోజుల పాటు ఆరు దేశాల్లో పర్యటించారు. ఆ సమయంలో రష్యాతో పాటు మధ్య ఆసియా దేశాల్లో మోదీ పర్యటన కొనసాగింది. ఇకపోతే.. ఈసారి జరగనున్న సుదీర్ఘ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ తొలుత జులై 2, 3 తేదీల్లో ఘనాలో పర్యటిస్తారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. ఈ పర్యటన సందర్భంగా మోదీ.. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని సమీక్షించనున్నారు. ఆర్థిక, ఇంధన, రక్షణ సహకారం తదితర అంశాలపై ఆ దేశాధ్యక్షుడితో చర్చిస్తారని విదేశాంగ శాఖ తెలిపింది. అనంతరం ప్రధాని ట్రినిడాడ్ అండ్ టొబాగొలలో జులై 3, 4 తేదీల్లో పర్యటించనున్నారు. 1999 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. అనంతరం జులై 4న అఆ౦ంటీనాకు వెళ్లనున్న ప్రధాని మోదీ.. 5వ తేదీ వరకు అక్కడే పర్యటిస్తారు. రక్షణ, వ్యవసాయం, మైనింగ్, చమురు, గ్యాస్, పునరుత్పాదక ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక రంగాల్లో ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించే అంశంపై అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో విస్తృత చర్చలు జరుపుతారు. ప్రధాని ద్వైపాక్షిక పర్యటన భారత్, అఆ౦ంటీనా మధ్య బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. అనంతరం బ్రెజిల్‌లో 5నుంచి 8వ తేదీ వరకు ప్రధాని మోదీ పర్యటిస్తారు. బ్రెజిల్‌లోని రియో వేదికగా జరగనున్న 17వ బ్రిక్స్ సదస్సులో పాల్గొని ప్రపంచంలో పలు అంశాలపై అభిప్రాయాలను పంచుకోనున్నారు. ప్రపంచ పాలనా సంస్కరణలు, శాంతి భద్రతలు, కృత్రిమ మేధస్సును బాధ్యతాయుతంగా ఉపయోగించడం, వాతావరణం, ప్రపంచ ఆరోగ్యం, ఆర్థిక అంశాలతో పాటు పలు కీలక అంశాలను ప్రస్తావించే వకాశం ఉంది. అలాగే, ఈ సదస్సు నేపథ్యంలోనే పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అనేంతరం 9న నమీబియాకు వెళ్లి.. ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. నమిబియా పార్లమెంటులోనూ ప్రధాని ప్రసంగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# బనకచర్లపై కేంద్ర నిర్ణయం స్వాగతిస్తున్నాం

- **బీఆర్ఎస్ పోరాట విజయమన్న హరీష్, కవిత**

హైదరాబాద్,జూన్ 30 : పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇది భారాస, తెలంగాణ ప్రజల పోరాట విజయమని అన్నారు. తెలంగాణ జలాలపై ఏపీ చేస్తున్న కుట్రలకు ఇదో చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిలిపివేసేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పును పరిశీలించాల్సి ఉందని తెలిపింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించడం అత్యవసరమని కమిటీ అభిప్రాయపడిరది.పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి నిరాకరించడం హర్షణీయమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ నిర్ణయం తెలంగాణ జాగృతి, భారాస సాధించిన విజయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇకనైనా తెలంగాణ ప్రయోజనాల కోసం పని చేయాలన్నారు. ' బనకచర్లపై అపెక్స్ కౌన్సిల్ నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలి. రాష్ట్రానికి 968 టీఎంసీలను ప్రాజెక్టుల వారీగా కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని కవిత డిమాండ్ చేశారు.


# ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం

**క్షతగాత్రులకు హరీష్ రావు పరామర్శ**
**మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్**

**హైదరాబాద్ ,జూన్ 30 :** పరిశ్రమల భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతోనే పాశమైలారం ప్రమాదం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధ్వజమెత్తారు. పాశమైలారం పరిశ్రమ పేలుడు ఘటనపై మాజీ మంత్రి, హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. నేపాశమైలారం పారిశ్రామిక వాడలో ఘోర ప్రమాదంలో గాయపడినవారిని హరీష్ రావుతో పాటు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రావు కలిసి పటాన్ చెరులోని ధ్రువ ఆసుపత్రిని సందర్శించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రమా దం జరిగి ఐదు గంటలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 150 మంది వరకు కార్మికులు ఉన్నారని, అయితే ఇప్పటివరకు 60 మంది ఆచూకీ లభించకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అస్పత్రిలో 11 మంది గాయపడిన వారు చికిత్స పొందుతుండగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందన్నారు. వెంటనే మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని.. దీనికోసం జిల్లాకు చెందిన ఎస్పీ, కలెక్టర్ లను ఫోన్ ద్వారా సంప్రదించి.. పరిస్థితి విషమంగా ఉన్న వారిని హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అంతేకాకుండా, ఈ ఘటనలో మరణించిన కార్మిక కుటుంబాలకు తక్షణమే రూ. కోటి ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు. బాధిత కు టుంబాలు తమ బంధువుల ఆచూకీ లేక ఆందోళనకు గురవుతున్నాయని తెలిపారు.

# స్వేచ్ఛ ఆత్మహత్యలో పూర్ణ ప్రమేయం లేదు

- **నా భర్త అమాయకుడు, నిర్దోషి**
- **పూర్ణచందర్ భార్య సంచలన వ్యాఖ్యలు**





**హైదరాబాద్, జూన్ 30:** ప్రముఖ టీవీ చానల్ న్యూస్ యాంకర్ స్వేచ్ఛ వొటార్కర్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో నిందితుడు పూర్ణచందర్ భార్య స్వప్న తెరపైకి వచ్చారు. నా భర్త పూర్ణచందర్ నిర్దోషి, అమాయకుడని స్వప్న సంచలన వ్యాఖ్యలు చేశారు.పూర్ణ చందర్ ద్వారానే స్వేచ్ఛ తనకు పరిచయం అయిందన్నారు. అయితే, వారిద్దరి మధ్య సంబంధం గురించి ముందు తనకు తెలియదన్నారు. వారిద్దరి వ్యవహారం తెలిశాక పూర్ణను వదిలేశానని పేర్కొన్నారు. పూర్ణచందర్‌పై స్వేచ్ఛ కూతురు అరణ్య చేస్తున్న ఆరోపణలు అసత్యమని, అరణ్యను పూర్ణచందర్ సొంత కూతురిలా చూసుకున్నాడని స్వప్న వ్యాఖ్యానించారు. స్వేచ్ఛ నన్ను మానసికంగా టార్చర్ చేసిందని, స్వేచ్ఛ పూర్ణచందర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిందని స్వప్న షాకింగ్ కామెంట్స్ చేశారు. నా పిల్లలను కూడా అమ్మా అని పిలవాలని భయపెట్టిందని స్వప్న వివరించారు. స్వేచ్ఛ వోటార్కర్ ఆత్మహత్య కేసులో పూర్ణచందర్‌ను పోలీసులు నిన్న అరెస్ట్ చేశారు. అతడి వేధింపుల కారణంగానే తమ కూతురు మరణించినట్టు చిక్కడపల్లి పోలీసులకు స్వేచ్ఛ తండ్రి ఫిర్యాదు చేయడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ నేపథ్యంలోనే నిందితుడు పూర్ణచందర్ రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వేచ్ఛ, నేను స్నేహితులుగా ఉండేవాళ్లం. ఐదేళ్లుగా ఆమె మానసికంగా ఆందోళన చెందుతూ చికిత్స పొందుతుంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు నా వద్ద ఉన్నాయి. స్వేచ్ఛ ఆత్మహత్యతో నాకు ఏలాంటి సంబంధం లేదని లేఖలో పూర్ణచందర్ పేర్కొన్నారు.

# సున్నం చెరువులో ఆక్రమణల తొలగింపు

**హైదరాబాద్, జూన్ 26:** హైదరాబాద్ నగర పరిధి మాదాపూర్‌లోని సున్నం చెరువులో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 32 ఎకరాల విస్తీర్ణంలోని సున్నం చెరువులో భారీగా ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గుడిసెలను కూల్చేశారు. చెరువు సమీపంలో అక్రమంగా వేసిన బోరు మోటార్లను తొలగించారు. ఇక్కడ ఏళ్ల తరబడి అక్రమ నీటి వ్యాపారం సాగుతోంది. చెరువు పరిధిలోని భూగర్భ జలాలను వినియోగించొద్దని హైడ్రా సూచించింది. అక్రమంగా నీటిని తరలిస్తున్న పలు వాటర్ ట్యాంకర్లను సీజ్ చేసింది. రూ.10 కోట్లతో సున్నం చెరువును హైడ్రా అభివృద్ధి చేస్తోంది.



## మహా టీవీపై దాడిని ఖండించిన వేములవాడ ప్రెస్ క్లబ్

**శెనార్తి మీడియా, వేములవాడ:**

మహా టీవీ కార్యాలయంపై దుండగులు దాడి చేసిన ఘటనను వేములవాడ ప్రెస్ క్లబ్ ఖండించింది. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక విలేకరులు సోమవారం నిరసన తెలిపారు. ప్రెస్ క్లబ్ కార్యాలయం నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ దాడులతో మీడియాను భయపెట్టాలనుకోవడం సరికాదన్నారు. అన్నింటినీ తాము ఎదుర్కొని నిలబడతామని పేర్కొన్నారు. రాజకీయ ముసుగులో దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలన్నారు. భవిష్యత్తులో మీడియాపై దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నుగురి మహేష్, సంఘ దాడుల పరిశీలన కమిటీ జిల్లా సభ్యుడు కొక్కుల శ్రీను, దూరదర్శన ప్రతినిధులు ఐన్యూస్ ప్రతినిధి ప్రశాంత్, వీవీ6 బాబు, పదిహేను టీవీ శంకర్, టీవీ9 చంద్రశేఖర్, ఎన్టీవీ శ్రీను, మహా టీవీ సంపత్ రాజ్, వార్త టీవీ ప్రవీణ్, ఆరు టీవీ రఘు, బిగ్ టీవీ రవి, సీవీఆర్ సాయి, జెమినీ టీవీ నరేష్, మల్లేశం, కిషన్, కలీం పాషా, శ్రీను, దేవేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ కల్పించాలి: లాయక్ పాషా

**శెనార్తి మీడియా, వేములవాడ:**



ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్న అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో నూటికి నూరు శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ను కలిగి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు జీతభత్యాలు లేకుండా సమాజ సమస్యలను ప్రభుత్వానికి, ప్రజలకు చేరవేస్తూ వారధిగా పనిచేస్తున్నారని లాయక్ పాషా పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో పూర్తి ఫీజు రాయితీతో పాటు, నోట్ బుక్స్ ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో కొందరు విద్యాసంస్థలు డీఈవో ఉత్తర్వులను అమలు చేయకపోవడం వల్ల జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈసారి ఖచ్చితంగా అమలు చేయించేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఇన్‌చార్జ్ డీఈవో వినోద్ కుమార్ ఈ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టు పిల్లలకు పూర్తి రాయితీ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్, తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామాల గట్టు, సీనియర్ జర్నలిస్టులు గడదాసు ప్రసాద్, కొలిపాక నరసయ్య, సయ్యద్ అలీ, జితేందర్ రావు, లింగం గోపి, కొత్వాల్ శ్రీనివాస్, జిల్లా రమేష్, రాజశేఖర్, సాగర్, షేక్ రియాజ్, విష్ణు గంగాధర్, దుబ్బాక రాజు, మదు సాగర్, దేవేందర్, దేవరాజు, అనిల్ రావు, అజారొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నలుగురిపై పీడీ యాక్ట్

**శెనార్తి మీడియా, వేములవాడ:**



గంజాయి, హత్యాయత్నం, హత్య కేసుల్లో నిందితులుగా ఉన్న నలుగురు వ్యక్తులు వరుస నేరాలకు పాల్పడుతూ ప్రజల్లో భయభ్రాంతులు సృష్టిస్తున్నారని పోలీసులు గుర్తించారు. వారిపై నిర్బంధ నిబంధనల చట్టం (పీడీ యాక్ట్)ను అమలు చేశారు. సోమవారం వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ నేతృత్వంలో నిందితులను చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితులు బైరెడ్డి వినయ్ (కోనయ్యపల్లి - వేములవాడ), ఈర్ల సాయి (ఉప్పుగడ్డ - వేములవాడ పట్టణం), వస్తాద్ అఖిల్ (ఉప్పుగడ్డ - వేములవాడ), నేదూరి రాజేష్ (బాలరాజుపల్లి - వేములవాడ రూరల్ మండలం) గతంలోనూ గంజాయి సరఫరా, హత్యాయత్నం, హత్య కేసులలో ప్రధాన నిందితులుగా ఉన్నారు. శిక్ష అనుభవించినప్పటికీ వీరి ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో మళ్లీ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి కారణంగా స్థానికంగా శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయని, ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పీడీ యాక్ట్ అమలుకు ఆమోదం తెలపడంతో, జిల్లా పోలీస్ అధికారి మహేష్ బి. గితే ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు. నిందితులను వేములవాడ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని చర్లపల్లి జైలుకు తరలించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని, జిల్లాలో ఉన్న రౌడీషీటర్లు, పాత కేసుల నిందితులపై నిత్యం నిఘా కొనసాగుతుందని, తరచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ చట్టాన్ని అమలు చేస్తామని ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు.

## కరీంనగర్ డెయిరీ హుస్నాబాద్ అధ్యక్షుడిగా కాయిత బాల్ రెడ్డి మరోసారి ఎన్నిక..

**డైరెక్టర్లుగా ఆకుల శ్రీనివాస్ పటేల్,కాటం మహేష్ యాదవ్ లు ఎన్నిక..**
**వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను పెంపొందించుకోవాలి..**
**సమావేశంలో సింగిల్ విండో చైర్మన్,మాజీ పాలకేంద్రం అధ్యక్షులు బొలిశెట్టి శివయ్య పిలుపు..**



**శెనార్తి మీడియా, హుస్నాబాద్:**

వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమలు పెంపొందించుకోవాలని,పాడి పరిశ్రమతో రైతులు మరింత ఆర్థిక అభివృద్ధి సాధించాలని హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్,మాజీ పాల కేంద్రం అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్య పాల ఉత్పత్తిదారులకు పిలుపునిచ్చారు.సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ డెయిరీలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో పాల ఉత్పత్తిదారుల సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో కాయిత బాల్ రెడ్డిని 4వసారి పాల కేంద్రం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.డైరెక్టర్లుగా ఆకుల శ్రీనివాస్ పటేల్, కాటం మహేష్ యాదవ్ లను ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్షుడిని,డైరెక్టర్లను శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్నామని,సమిష్టి కృషితో పాలకేంద్రం అభివృద్ధికి ముందుకు వెళుతున్నట్లు చెప్పారు.హుస్నాబాద్ పాల కేంద్రం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.18సంవత్సరాలు కొనసాగిన తనకు సహకరించిన పాల ఉత్పత్తిదారులకు బొలిశెట్టి శివయ్య ధన్యవాదాలు తెలిపారు. పాల కేంద్రం అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గుర్రాల సంజీవరెడ్డి, బిజాన్ బి, మాధవి,కాశవేణి మల్లేశం,బొలిశెట్టి సమ్మయ్య పటేల్,కంభం రవీందర్ పటేల్, గొర్ల సాంబరాజు,పాలకేంద్రం కార్యదర్శి మంద జనార్ధన్ రెడ్డి,పాల ఉత్పత్తిదారులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్,బొల్లిశెట్టి సంపత్,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్వారీల మీదున్న ప్రేమ ప్రజలపై లేదా?

**ఏడాదిన్నరలో చేసిన ఒక్క పని చెప్పు**
**మంజూరైన రోడ్డును కూడా పూర్తిచెయ్యలేవా?**
**నీ వల్ల కాదంటే చెప్పు మేమే సాధించుకుంటం**
**నీ అబద్ధాలతోని ప్రజలు మోస పోయిండ్రు**
**ఇందిరమ్మ కమిటీలు కాదు..కాంగ్రెస్ కమిటీలు**
**నీ అవినీతి పరాకాష్ట వల్లే మంత్రి పదవి రాలే**
**నీ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరు**
**గన్నేరువరం నుంచే నీ పతనం ప్రారంభం**
**పొత్తూరు, గుండ్లపల్లి రోడ్డు వేయకుంటే**
**12 తారీఖున ప్రజలను సమీకరిస్తం**
**రోడ్డు సాధించే దాకా పోరాటం చేస్తం**
**మాజీ ఎమ్మెల్యే రసమయి హెచ్చరిక**
**గుండ్లపల్లిలో విలేకరుల సమావేశం**



**శెనార్తి మీడియా, గన్నేరువరం :**

ఎన్నికలప్పుడు ఇంటింటికీ తిరిగి బాండ్ పేపర్ రాసిచ్చి.. మాయమాటలతో గద్దెనెక్కి ఏడాదిన్నరైనా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మండిపడ్డారు. ఇచ్చిన అరకొర ఇందిరమ్మ ఇండ్లకు అనర్హులను ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.గన్నేరువరం మండలం నుంచి 2561 మంది పేర్లను ఎంపిక చేసి అన్ని గ్రామసభల్లో చదివి వినిపించారని, తమ పేరు జాబితాలో వచ్చిన చాలా మంది పేదలు ఇండ్లకోసం ఎదుచూశారని, వారందికీ ఎమ్మెల్యే కవ్వంపల్లి మొండిచెయ్యి చూపారని ధ్వజమెత్తారు. 16 గ్రామాల్లో 2561 మందిని ఎంపిక చేసి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేవలం 161 మంది ఇండ్లకు ప్రొసీడింగ్ ఇస్తున్నట్టు చెప్పి పబ్బం గడుపుకొంటున్నారని కన్నెర్రజేశారు. సోమవారం గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'కనీసం ఈ 161 మందిలో నిజమైన పేదలు ఎంతమంది ఉన్నారో ఎమ్మెల్యే చెప్పాలె.. పరిగ ఏరినట్టే నలుగు రైదుగురిని చూపించి 40 మందికి పైగా అనర్హులకు ఇండ్లు ఇచ్చిండ్రు.. కాంగ్రెస్ ప్రభుత్వం వేసినవి ఇందిరమ్మ కమిటీలు కావు.. కాంగ్రెస్ కమిటీలు.. వాళ్లకు దగ్గరోళ్లకు, భూములు, ట్రాక్టర్లు ఉన్నోళ్లను ఇండ్లకు ఎంపిక చేసిండ్రు. చాలా మంది పేదలున్నా వారికి ఇవ్వలే. పేద బుడగజంగాల వాళ్లు ఉన్నా కనీసం ఐదు, పది మందిని కూడా ఎంపిక చేయలే.. కాశిపేట, మాదాపూర్, గుండ్లపల్లి, మైలారం ఇట్ల ఏ గ్రామాన్ని చూసినా పేదలు లబోదిబో మంటున్నరు.. ముందుగా అర్హులకు ఇచ్చి.. తర్వాత మీ ఇష్టం ఉన్నోళ్లకు ఇచ్చుకోండ్రి.. నియోజకవర్గంలో 40 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామని చెప్తున్న 3 వేల ఇండ్లు ఎక్కడ సరిపోతయి? మా ప్రభుత్వంలో మేం పక్షపాతం చూపలేదు. ఈ పార్టీ, ఆ పార్టీ అని చూడకుండా పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇచ్చినం. మీరు కనీసం ఈ పథకానికి నిధులు కేటాయించిండ్రా? కేంద్రం ఇచ్చే డబ్బులను అరకొర పెట్టి మమ అనిపిస్తున్నరు. పాపం అప్పు సప్పు చేసుకొని ముగ్గులు పోసుకున్నవారి పరిస్థితి తలుసుకుంటే భయమైతాంది. నీలో నీతి, నిజాయితీ ఉంటే.. నువ్వ అర్హులకే ఇండ్లు ఇచ్చి ఉంటే మండలానికో మీటింగ్ పెట్టాల్సిన అసరం ఏమున్నది? పలానా వాళ్లకు ఇండ్లు ఇచ్చిన అని చెప్పే దమ్మూ, ధైర్యం ఉన్నదా నీకు? నువ్వు ఆంధ్రా పార్టీలో ఉన్నోడివి.. మేము ప్రజల కోసం ఉన్నం. దేనికైనా సిద్ధపడి ఉన్నం' అని రసమయి నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇండ్లపై ఎమ్మెల్యేను ప్రశ్నిస్తే తన సహనాన్ని పరీక్షించవద్దంటూ బీఆర్ఎస్ నాయకులపై దౌర్జన్యం చేస్తున్నారని, ప్రజల సహనాన్నే కవ్వంపల్లి పరీక్షిస్తున్నారని ఫైర్ అయ్యారు. మండలంలో నిర్మాణ దశలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తిచేసి పేదలకు ఇవ్వాలని సూచించారు. 'నేను వంద శాతం ఇండ్లు ఇచ్చిన.. డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇచ్చిన.. 800 ఇండ్లు కట్టిచ్చిన.. పెద్ద లింగాపూర్, ఇల్లంతకుంట, ఒగులాపూర్‌ల ఇండ్లు కనబడుతలేవా? నువ్వు ముగ్గు మాత్రమే పోసి డబ్బా కొట్టుకుంటున్నవ్' అని దెప్పిపొడిచారు.

**12 తారీఖున ప్రజలతో కలిసి పోరాటం**

గుండ్లపల్లె నుంచి పొత్తూరు వరకు 72 కోట్లతో రోడ్డు మంజూరు చేయిస్తే ఇప్పటివరకు ఆ రోడ్డు నిర్మించకపోవడం శోచనీయమని ఎమ్మెల్యే వాపోయారు. 'గన్నేరువరానికి డబుల్ రోడ్డు తీసుకొచ్చిన.. 72 కోట్లు అప్పజెప్పిన.. 18 నెలలు అయితాంది.. ప్రజలు సచ్చిపోతాండ్రు.. జంగపల్లోళ్లు ఈనంగం రోడ్డు వదిలేసిండ్రు.. ఆటో డ్రైవర్లు సొంతంగా డబ్బులు పెట్టి రోడ్డును సాస్ చేసుకొని గిరాకీ లేక అష్టకష్టాలు పడుతుండ్రు.. పీచుపల్లి దాకా స్వయంగా మట్టి పోసుకొని నడుపుతాండ్రు.. మీకు సిగ్గనిపిస్తలేదా?' అని నిలదీశారు. 'బిల్లులు ఇప్పిస్తా అని కమీషన్లు తీసుకున్నవు. ఇయ్యాల ఆయా గ్రామాలకు తిరిగే పరిస్థితి లేక దొంగలెక్క తిరిగొస్తున్నవు. వర్షకాలం వస్తావున్నది.. కాలు పెట్టే పరిస్థితి లేదు.. డబుల్ రోడ్డు నీకు శాతగాదంటే చెప్పు.. డబల్ రోడ్డు నిర్మాణం చేపట్టేలా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఉద్యమం చేపడుతం. ఈనెల 12న ప్రజలందరినీ ఏకం చేసి పోరాటం చేస్తం' అని హెచ్చరించారు. 'మంత్రి పదవి రాకముందే దావ్ డీమ్ అని ఎగిరినవ్.. పటాకులు కొట్టుకొని స్వీట్లు పంచుకున్నవ్.. నీ అవినీతి పరాకాష్ట వల్లే నీకు మంత్రి పదవి రాలే' అని ఎద్దేవాచేశారు. హుస్నాబాద్‌కు ఆర్అండ్ బీ మంత్రి వచ్చినా కనీసం ఆయనను కలిసి రోడ్డు బిల్లులు ఇప్పించుకోలేదని మండిపడ్డారు. 'గుర్తుపెట్టుకో నీ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరు.. గన్నేరు వరం నుంచే నీ పతనం ప్రారంభం.. 12 తారీఖు రోజున ప్రజలను సమీకరిస్తం. పొత్తూరు, గుండ్లపల్లి రోడ్డు సాధించే దాకా పోరాటం చేస్తం.. ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తం' అని హెచ్చరించారు.

### *క్వారీల కోసమే ఎమ్మెల్యే అయినవా?

కవ్వంపల్లికి ఇసుక క్వారీల మీద ఉన్న ప్రేమ ప్రజలపై లేదని రసమయి మండిపడ్డారు. 'ఊటూరులో సొంత ఇసుక క్వారీ తీసుకొని నడుపుతున్నవ్.. మానకొండూరు, అన్నారం వాళ్లు అడ్డం పడ్డరు. ఇసుక లారీలను దొరకపడితే మంత్రిని బతిలాడుకొని ఇడిపించుకున్నవ్ ఇసుక క్వారీల కోసమే ఎమ్మెల్యే అయినవా?' అని నిలదీశారు. ఆయన పేరు కవ్వంపల్లి సత్యనారాయనణ కాదని, కమీషన్ల నారాయణ అలియాస్ ఇసుక నారాయణ అని ఎద్దేవాచేశారు. అఖరికి సీఎం రిలీఫ్ ఫండ్స్ కూడా పంచుకున్నారని, తాము కేసులు పెట్టిస్తే ఇప్పుడు భయపడి క్యాంప్ ఆఫీస్‌ల చెక్కులు పంచుతున్నారని విమర్శించారు. 'నీ నిజ స్వరూపాన్ని ప్రజలు తెలుసుకున్నరు. ఇంకా ఎన్నిసార్లు మోసం చేస్తరు? నియోజకవర్గంలో నువ్వు చేసిన ఒక్క అభివృద్ధి పని చెప్పు.. నేను గోదావరి నీళ్లు తెచ్చిన, పీహెచ్‌సీ సెంటర్లు కట్టిచ్చిన, ఊరూరికి వారసంతలు కట్టిచ్చిన, ప్రార్కులు, జిమ్ములు పెట్టిచ్చిన..రోడ్లు వేయించిన.. ఒక్క శిలాఫలకం మీద అయినా నీ పేరు ఉన్నదా?' అని ప్రశ్నించారు. గన్నేరువరం కోసం గుండ్లపల్లికి రెసిడెన్షియల్ బిల్డింగ్ తీసుకొస్తే మానకొండూరులో పెట్టుకున్నారని మండిపడ్డారు. ఎవరేం చేసిండ్రో ప్రజలు చూస్తున్నారని, ఇకనైనా అబద్ధాలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, గన్నేరువరం మండలం తో పాటు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, మహిళా అధ్యక్షురాలు కుసుంబ నవీన, నాయకులు లింగాల లక్ష్మణ్, పాకాల మహిపాల్ రెడ్డి , పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, బద్దం తిరుపతిరెడ్డి, గొల్లపల్లి రవి, అటికం శ్రీనివాస్, అనుమాండ్ల మల్లేశం, చింతల రవి, బావండ్ల తిరుపతి తో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి



**శెనార్తి మీడియా, రాజన్న సిరిసిల్ల:**

మిడ్ మానేరు ప్రాజెక్ట్ ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. బోయినపల్లి మండలంలోని కొదురుపాక, వరద వెల్లి, నీలోజిపల్లి గ్రామాల నిర్వాసితులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. ప్రతి గ్రామం వారీగా సమస్యలను తెలుసుకుంటూ, ఇండ్ల పరిహారం, 18 ఏండ్లు నిండిన యువతకు పరిహారం అందకపోవడం, కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, బస్ షెల్టర్, స్కూల్ బిల్డింగ్‌లకు పరిహారం రాకపోవడం వంటి అంశాలను నిర్వాసితులు ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మానవతా దృక్పథంతో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యం హామీ ఇచ్చారు. దరఖాస్తులపై మరోసారి సర్వే చేయించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని చెప్పారు.

**గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు**

కొదురుపాకలో బుధవారం, వరద వెల్లిలో గురువారం, నీలోజిపల్లిలో శుక్రవారం రెవెన్యూ అధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎమ్మెల్యే సత్యం వెల్లడించారు. నిర్వాసితులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో వేములవాడ ఆర్డీవో ఎస్డీసీ రాధాబాయ్, బోయినపల్లి తహసిల్దార్ నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి రసమయి పరామర్శ

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి మండలంలోని పోతారం (రెడ్డికుంటపల్లి) గ్రామానికి చెందిన మానాల రవి మాతృమూర్తి మృతి చెందగా, మాజీ శాసనసభ్యుడు డాక్టర్ రసమయి బాలకిషన్ సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లింగాల లక్ష్మణ్, గాగిల్లాపూర్ మాజీ ఎంపీటీసీ కోమీరే మల్లేశం, కర్రావుల మల్లేశం, జెట్టి అర్జున్ తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం..



*** ఉల్లంపల్లి గ్రామంలో ప్రైవేట్ బస్సులను వెనక్కి పంపిన గ్రామస్తులు**

**శెనార్తి మీడియా, చిగురుమామిడి:**

ప్రైవేట్ పాఠశాల వద్దు,ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అంటూ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామానికి వచ్చిన హుస్నాబాద్ సెయింట్ జోసెఫ్ స్కూల్ బస్సును,విస్డం ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సులను అడ్డుకొని వెనక్కి పంపిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది.ఈ సందర్భంగా గ్రామస్తులు,ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలల్లోనే నాణ్యమైన విద్యతోపాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం,ఉచితంగా పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్స్, స్కాలర్షిప్ లు సైతం ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని,దాన్ని సామాజిక బాధ్యతగా చూడాలని గ్రామస్తులు పేర్కొన్నారు. ఉల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది నేడు ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారని,అలాంటి ప్రభుత్వ పాఠశాలను కాదని ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోవడంతో పాఠశాల మూతపడుతుందని గ్రామస్తులంతా ఐక్యతతో ఉండి ప్రైవేటు బస్సులను నిలిపి వేయడంతో విద్యార్థులను అక్కడే దింపి బస్సులు వెనక్కి వెళ్ళాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కానవేని శివకుమార్, మాజీసర్పంచ్ కొత్త కైలాసం,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాదిక్ అలీ,స్కూల్ అసిస్టెంట్ కాళిదాస్, కరుణాకర్,రాజు ,శ్రీనివాస్ రెడ్డి, మహిళా సంఘాల సిఏలు బుర్ర శ్రీలత,ఎలగందుల సాత్విక,వివో సంఘం అధ్యక్షురాలు లత, విజయలక్ష్మి,గ్రామస్తులు, కొత్త తిరుపతి, కానవేణి, ఓదయ్య ,తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నేరువరం ఆధ్వర్యంలో గ్రామ చావడి వద్ద గల ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం, రేకుర్తి కంటి దవాఖానలో ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకులు బొడ్డు సునీల్ కోరారు.

## చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండలం మైలారం గ్రామానికి చెందిన గువ్వ రవి (43) ఆదివారం రోజు లోయర్ మానేరు డ్యాం వద్ద చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మృతిచెందాడు. ఈ ఘటనపై రవి భార్య గువ్వ మంజుల ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఆదివారం రవి డ్యాం వద్ద చేపల వేటకు వెళ్లి అదుపు తప్పి నీటిలోకి జారి మృత్యువాత పడ్డాడు. రవి మృతదేహం సోమవారం లభ్యమైందని పోలీసులు తెలిపారు. గువ్వ మంజుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కోసం సిపిఐ పోరుబాట

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**



అర్హులకి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలనే డిమాండ్‌తో సిపిఐ నాయకులు సోమవారం గన్నేరువరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా, అర్హులైనవారికి వెంటనే ఇందిరమ్మ గృహాలను కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న రైతుల రుణమాఫీని అమలు చేయాలని, మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, రోడ్డు పక్క బావులకు రక్షణ గోడలు నిర్మించాలని, మండలానికి గురుకుల పాఠశాలను తీసుకురావాలని కోరారు. అలాగే కల్వర్టులు, రోడ్ల విస్తరణ, ప్రజాభిప్రాయం మేరకు వంతెన నిర్మాణం వంటి సమస్యల పరిష్కారాలను డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం సీనియర్ సహాయకుడు శ్రీనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చోక్కల్ల శ్రీశైలం, సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, పిప్పల్ల కనుకయ్య, జిల్లా నాయకులు కాంతలా అంజిరెడ్డి, బోయిని కనకయ్య, యువ నాయకుడు మోలుగురి ఆంజనేయులు, అఖిల భారత విద్యార్థి సమాఖ్య మండల నాయకుడు ముల్కల పవన్, బోయిని తిరుపతి, బొమ్మకంటి ఆంజనేయులు, లింగం గణేష్, చెరుకు ఆంజనేయులు, బోయిని మల్లయ్య, ఎండి నయుం, చిటవేణి రాము, లక్ష్మణ్, న్యాత కొమరయ్య, జాలి గోపయ్య, కూన సంపత్, దామా సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ ఉద్యోగులకు ఘన వీడ్కోలు

**శెనార్తి మీడియా, వేములవాడ:**



శ్రీ రాజ రాజేశ్వర దేవస్థానంలో సుదీర్ఘకాలంగా సేవలందించిన తాండ్ర రాజయ్య-మణెమ్మ (స్కావెంజర్), పిట్టల భద్రమ్మ (స్కావెంజర్), కుమ్మరి భూదమ్మ (స్కావెంజర్)లు సోమవారం పదవీవిరమణ చేశారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కూరగాయల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పురాణం వంశీ తదితరులు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో ఏఈఓలు శ్రవణ్ కుమార్, అశోక్, ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్, కట్కూరు వెంకటయ్య, ఏఈ రాంకిషన్ రావు, పర్యవేక్షకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా సాధించాలి

**రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఈ సీజన్లో లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేయడంతో బాధ్యతలు మరింత పెరిగాయని తెలిపారు.రేషన్కార్డుదారులకు జూన్, జూలై, ఆగస్టు నెలల ఉచిత సన్నబియ్యం పంపిణీ పూర్తి చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.07 కోట్ల మెట్రిక్ టన్నుల సి.ఎం.ఆర్. ధాన్యాన్ని పూర్తి చేయాల్సి ఉందని, నెలకు కనీసం 9 లక్షల మెట్రిక్ టన్నులు డెలివరీకి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు అవగాహన కల్పించాలని సూచించారు.రేషన్కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకంగా వ్యవహరించి అర్హులైన వారికి మాత్రమే జారీ చేయాలని స్పష్టం చేశారు. ఒకే సభ్యుడు ఉన్న కార్డు కోసం 22,644 దరఖాస్తులు వచ్చాయని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... ధాన్యం కొనుగోలులో రైతులకు సౌకర్యం కల్పించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రేషన్కార్డుల జారీ నిబంధనల ప్రకారం కొనసాగుతుందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ అనివార్యం**

ప్రజలకు సేవలందించే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకురాలిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఈ రాజేశ్వరి దంపతులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 37 సంవత్సరాల పాటు విధులలో నిబద్ధతతో సేవలందించిన ఈ రాజేశ్వరి కృషి ప్రశంసనీయమని, వారి సేవలు మరువలేనివని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి కోసం విలువైన ప్రయత్నాలు చేసిన ఈ రాజేశ్వరి పని తీరుకు ప్రశంసలు అందించారు. ప్రతి ఉద్యోగి విధులలో చేరిన రోజే పదవీ విరమణ తేదీ నిర్ణయించబడుతుందని, ఉద్యోగం ముగిసిన తర్వాత కుటుంబంతో కలిసి ఆనందంగా గడపాలని సూచించారు.జిల్లా షెడ్యూల్డ్ కులముల సహకార సంస్థ ఈ.డి.గా పనిచేస్తున్న చాతరాజుల దుర్గాప్రసాద్కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ బాధ్యతలు జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




**పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం అవసరం**

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జరిగిన సమావేశంలో నేషనల్ స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటేషన్–2025 గోడప్రతులను ఆవిష్కరించారు.కేంద్ర, రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖలు, విద్యాశాఖల సౌజన్యంతో జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు "హరిత జీవన విధానం" నినాదంతో నిర్వహించనున్న ఈ పోటీలలో విద్యార్థుల భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణంపై అవగాహన పెంచుతూ దేశీయ సంప్రదాయాలను పునరుద్ధరించడమే లక్ష్యమని తెలిపారు.పోటీల్లో మొక్కలు నాటడం, చెత్త వేరు చేయడం, నీటి సంరక్షణ వంటి అంశాలు ఉండనున్నాయి. వయస్సు ఆధారంగా విద్యార్థులను గ్రూప్–ఎ (1వ తరగతి నుంచి 5వ తరగతి), గ్రూప్–బి (6వ తరగతి నుంచి 8వ తరగతి), గ్రూప్–సి (9వ తరగతి నుంచి 12వ తరగతి), గ్రూప్–డి (డిగ్రీ, పి.జి., రీసెర్చ్ విద్యార్థులు), గ్రూప్–ఈ (ఇతరులు)గా విభజించారు. ఆగస్టు 30న ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పోటీల్లో సక్రమంగా పాల్గొనేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జాతీయ హరిత దళం సమన్వయకర్త మధుబాబు తదితరులు పాల్గొన్నారు.






## జూలై-ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధం

- జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్. అవినాష్

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



జిల్లాలో జూలై, ఆగస్టు నెలలలో చేపల ప్రత్యుత్పత్తి కాలం ఉండటంతో చేపలు పట్టడం నిషేధించబడిందని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్. అవినాష్ తెలిపారు. ఈ నిషేధం ఎల్లంపల్లి ప్రాజెక్టు, గోదావరి నది, అన్నారం, సుందిళ్ళ బ్యారేజ్లు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, రాళ్ళవాగు–ముల్కల్ల, గొల్లవాగు ప్రాజెక్టు–పోతనపల్లి, నీల్వాయి ప్రాజెక్టు–నీల్వాయి ప్రాంతాలకు వర్తిస్తుందని వివరించారు.ఈ నిషేధం 1 జూలై, 2025 నుండి 31 ఆగస్టు, 2025 వరకు అమల్లో ఉంటుందని, ఈ కాలంలో చేపల వేటకు అనుమతులు జారీ చేయబడవని తెలిపారు. మత్స్యకారులు ఈ నిబంధనలను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతీ మత్స్యకారుడు సహకరించి ఈ ప్రక్రియ విజయవంతం చేయాలని మత్స్యశాఖ కోరింది. చేపల వేట నిషేధం అమలులో ఉండే కాలంలో మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని అవసరమైన చర్యలు తీసుకునే అవకాశాలను పరిగణనలోకి తీసు కుంటామని తెలిపారు.

## విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అభివృద్ధి పరచాలి




**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ట్రినిటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ క్యాబినెట్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ శైలజ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పిల్లలకు నాయకత్వ లక్షణాలు, లీడర్షిప్ గుణాలు ఎంతో ముఖ్యమని, మంచి విద్యతో భవిష్యత్తు మార్గాన్ని సుస్పష్టంగా రూపొందించుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ విద్యే బంగారు భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యతో పిల్లలు జీవితంలో ముందుకు సాగి రాణించగలరని వివరించారు.ట్రినిటీ పాఠశాల ప్రిన్సిపల్ జోసెఫ్ మాట్లాడుతూ.. పాఠశాలలో మొత్తం 1400 మంది విద్యార్థులుండగా, అందులో 48 మందిని స్కూల్ లీడర్స్, సైన్స్, మాథ్స్, లాంగ్వేజ్, డిసిప్లిన్, స్పోర్ట్స్ లీడర్స్గా ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థుల మధ్య బాధ్యతాభావం కలిగించేలా ఈ వ్యవస్థ ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, వైస్ ప్రిన్సిపల్ రాహుల్, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతుల పంట పొలాలకు సాగునీరు అందించడమే ధ్యేయం

**శెనార్తి మీడియా, జన్నారం:** రైతులందరి పంట పొలాలకు సాగునీటి అందించడమే తమ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ డివిజన్ కార్యాలయం ఆవరణలో రూ.35.5 లక్షలతో నిర్మించనున్న నూతన భవనానికి సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా రెండు పంటలకు నీరు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు.

## కవాల్ టైగర్ రిజర్వ్లో సఫారీకి మూడు నెలల విరామం

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** కవాల్ టైగర్ రిజర్వ్లో జంగిల్ సఫారీకి తాత్కాలిక విరామం ప్రకటించారు. జూలై 1, 2025 నుంచి సెప్టెంబర్ 30, 2025 వరకు సఫారీ కార్యకలాపాలు నిలిపివేయనున్నట్లు రిజర్వ్ అధికారులు తెలిపారు.నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఏడాది ఈ విరామం అమలు చేస్తారు. అక్టోబర్ 1, 2025 నుంచి సఫారీ మళ్లీ ప్రారంభం కానుంది. ఈ నిర్ణయం జంతువులకు విశ్రాంతి కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడనుంది.

## ఉద్యోగ విరమణ పోలీసులకు ఘన సన్మానం



**శెనార్తి మీడియా, గోదావరిఖని**

సుదీర్ఘకాలం క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారులను రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సన్మానించారు. సోమవారం పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్.ఐలు కె. వెంకటేశ్వర్ రావు, ఎన్. చంద్రశేఖర్, ఆర్ఐ ఎం. అంజయ్య లను పూలమాలలతో సత్కరించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ.. పదవీ కాలంలో తాము ఎదుర్కొన్న ఒడిదుడుకులు, భద్రతా పరిరక్షణ కోసం చూపించిన సమర్పణ భావం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత వారు ఆరోగ్యం కోసం యోగ, వ్యాయామం కొనసాగించడంతో పాటు, కుటుంబంతో ఆనందంగా గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సిసి ఆర్ బి ఇన్స్పెక్టర్ సతీష్, ఆర్ఐలు దామోదర్, మల్లేశం, వామన మూర్తి తదితరులు పాల్గొన్నారు. పదవీవిరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## మున్సిపల్ కమిషనర్ కు ఎమ్మార్పీఎస్ సమస్యల వినతి




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు రామగిరి మహేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ కు వినతిపత్రం అందజేశారు. నూతనంగా కమిషనర్ బాధ్యతలు చేపట్టిన ఆయనను ఈ సందర్భంగా ఆత్మీయంగా సన్మానించారు.బెల్లంపల్లి పట్టణంలోని 19వ వార్డులో రోడ్డు వెడల్పు పేరిట నిరుపేదుల ఇండ్లు, చిన్న దుకాణాలు కూల్చివేయడాన్ని రామగిరి మహేష్ తీవ్రంగా ఖండించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తీసుకున్న ఈ చర్యతో అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయాయని, వారి ఆశ్రయం, ఉపాధి కోల్పోయారని ఆరోపించారు.ఈ చర్యల వల్ల దినసరి ఆదాయంతో జీవించే నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్, శాసనసభ్యులు వినోద్ ప్రభావిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ కె. మోహన్ సోమవారం వెల్లడించిన వివరాల ప్రకారం, జూన్ 29న మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి "సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్"లో విశేష ప్రతిభ కనబరిచిన ఏ. అరుణ్ కుమార్, జి. సాయి చరణ్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.12 సంవత్సరాల విభాగంలో ఏ. అరుణ్ కుమార్ థాయిలాండ్ లాంగ్ జంప్, 60 మీటర్ల పరుగు, 600 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చగా, 14 సంవత్సరాల విభాగంలో జి. సాయి చరణ్ కిడ్స్ జావలిన్లో ప్రతిభ చూపించారు. వీరు జూలై 6న హన్మకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.విద్యార్థుల విజయం పట్ల కళాశాల ప్రిన్సిపాల్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ కే. మహేశ్వరరావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమేష్, సీనియర్ ఆధ్యాపకుడు డాక్టర్ పి. నగేష్, పీడీ కుమ్మరి శ్రీకాంత్, పిఈటి మారెపాక సాగర్ తదితరులు అభినందనలు తెలిపారు.

## స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

- పెద్దపల్లి సత్యనారాయణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

దివ్యాంగులకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తూ చట్ట సవరణ ఆర్డినెన్స్ తీసుకురావాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్ క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆసరా పెన్షన్లను తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ.15,000, సాధారణ వికలాంగులకు రూ.6,000, ఇతరులకి రూ.4,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో 4శాతం ఉద్యోగాలను చట్ట ప్రకారం భర్తీ చేయాలని, దివ్యాంగుల రోస్టర్ సంఖ్యను 10లోపు సవరించాలని సూచించారు. అలాగే, ఆర్టీసీ బస్సులు, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు ప్రతి జిల్లాలో పునరావాస సదనాలను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతి తరహాలో ప్రత్యేక ఆసుపత్రులు, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఐకేపీ ఆధ్వర్యంలో వికలాంగుల స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని ఆయన కోరారు. దివ్యాంగుల చట్టం సెక్షన్ 92 ప్రకారం పోలీసు, న్యాయ, ఇతర శాఖల నుండి ప్రత్యేక రక్షణ కల్పించాలని, ప్రతి వికలాంగునికి రూ.50 లక్షల విలువ గల ఆరోగ్య భీమా కార్డు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విహెచ్పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బానోతు అఖిల, మండల అధ్యక్షులు బొద్దుల బుచ్చి రాజం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ఏరియా జీఎం దేవేందర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల**




సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కట్టుబడి ఉంటానని ఏరియా జిఎం దేవేందర్ పేర్కొన్నారు. సోమవారం జిఎం కార్యాలయంలో గుర్తింపు కార్మిక సంఘంతో 7వ స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జిఎం దృష్టికి తీసుకెళ్లారు.కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం డిస్పెన్సరీల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, గనుల్లో రక్షణ పరికరాలు అందించడంలో లోపాలు ఉన్నందున వాటిని తక్షణమే సరిచేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు నిర్మించిన గృహాలకు మరమ్మతులు చేసి, నాణ్యమైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని, గనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చేయాలని కోరారు.ఈ సందర్భంగా జిఎం దేవేందర్ స్పందిస్తూ, కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ నాయకులు సూచించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఎస్ఓటు జిఎం విజయప్రసాద్, ఐఈడీ కిరణ్ కుమార్, డివైజిఎం సివిల్ రాములు, ఏజీఎం వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. కార్మిక సంఘం నాయకులు ఎండీ అక్బర్ అలీ, శైలేంద్ర సత్యనారాయణ, భీమనాదుని సుదర్శనం, సోమిశెట్టి రాజేశం తదితరులు కూడా పాల్గొన్నారు.

## పదవి విరమణ అధికారులకు ఘన సన్మానం



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన అధికారులకు ఘనమైన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో సోమవారం జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పదవి విరమణ పొందిన ఇంజనీర్ ఈఅండ్ఎం వెంకట రమణ, జీఎం పిపి ప్రసాద్, జీఎం ఆఫీస్ జూనియర్ ఆఫీసర్ బుచ్చయ్యలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా సేవలు అందించి సంస్థకు మన్ననలు తెచ్చిన ఈ అధికారుల పదవి విరమణ బాధాకరమైనదని, ప్రతి అధికారికి ఇది సహజం అని అన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులు విశేష సేవలతో సహాధికారుల, కార్మికుల ఆదరాభిమానాలు చూరగొన్నారు అని కొనియాడారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం విజయ్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులకు కఠిన చర్యలు

- ఎస్ఐ రాజశేఖర్




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ ఎస్ఐ రాజశేఖర్ సోషల్ మీడియా వేదికగా విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రగిలించే వ్యాఖ్యానాలు, పోస్టులు, వీడియోలు, ఫోటోలు చట్ట విరుద్ధమని అన్నారు.సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో ఇతరులను కించపరిచే లేదా అసత్య సమాచారం షేర్ చేసినా కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. అనధికారిక వీడియోలు, ఫోటోలు ధృవీకరణ లేకుండా షేర్ చేసినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు తమ గ్రూపులో ఫార్వార్డ్ అయిన నిరాధార పోస్టులకు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. సోషల్ మీడియాను సమాజ హితానికి వినియోగించాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వాడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని రాజశేఖర్ తేల్చిచెప్పారు.సామాజిక మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించిన ఆయన, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జి.ఓ.నెం.49 రద్దు చేయాలి

- సీఐటియు జిల్లా కార్యదర్శి రంజిత్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

తెలంగాణ రాష్ట్రంలో "కొమురం భీం కన్జర్వేషన్ రిజర్వ్" పేరుతో జారీ చేసిన జి.ఓ.నెం.49 ఆదివాసీ హక్కులను హరించివేస్తోందని సీఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ఆరోపించారు. సోమవారం కోయపోచంగూడెంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తాడోబా–అందేరి రిజర్వ్ ఫారెస్ట్‌ను కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌తో కలిపి కుంరం భీం జిల్లాలోని 334 గ్రామాలను "కొమురం భీం కన్జర్వేషన్ రిజర్వ్"గా గుర్తించడం 5వ షెడ్యూల్ చట్టాలకు వ్యతిరేకమని వ్యాఖ్యానించారు. గ్రామ సభల నిర్వహణ లేకుండా, ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఈ నిర్ణయం తీసుకోవడం స్థానికుల హక్కులను కాలరాస్తోందని తెలిపారు.జి.ఓ. అమలుతో అదనంగా, ఇళ్ల నిర్మాణం, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలను నిలిపివేయడం ఆదివాసీలకు తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తోందని వారు పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల హక్కులను పరిరక్షించేందుకు జి.ఓ.నెం.49ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ నాయకులు ఎల్లయ్య, రమేష్, పోశం, పోసవ్వ, మల్లవ్వ, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ పొందనివారు నష్టపోవాల్సిందేనా?



- ముగిసిన మూడు నెలల బియ్యం పంపిణీ
- ఇంకా మిగిలిన లబ్ధిదారులు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా జూన్, జూలై, ఆగస్టు నెలల ఉచిత సన్న బియ్యాన్ని జిల్లావ్యాప్తంగా పంపిణీ చేసిన విషయ. తెలిసిందే. నెల రోజుల పాటు బియ్యం పంపిణీ చేసినా ఇంకా కొందరు లబ్దిదారులు పొందలేకపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం అందిస్తామని ప్రకటించి, అమలు చేసింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వాలని నిర్ణయించడంతో రేషన్ పంపిణీ ఈ నెల మొదటి వారం నుంచే ప్రారంభమైంది. మంచిర్యాల జిల్లాలో మొత్తం 2,23,844 లబ్ధిదారుల్లో 2,00,179 మంది మాత్రమే మూడు నెలల సరుకును పొందగలిగారు. మిగిలిన సుమారు 23,600 మంది కార్డుదారులు వితరణకు నోచుకోలేదు. అంటే జిల్లాలో 90 శాతం పంపిణీ పూర్తయ్యిందన్న అధికారుల వివరాల ప్రకారం 10 శాతం లబ్ధిదారులు అనేక కారణాలతో రేషన్ పొందలేకపోయారు. మండలాల వారీగా చూస్తే బెల్లంపల్లి 85%, భీమిని 87%, చెన్నూరు 92%, దండేపల్లి 85%, జైపూర్ 89%, జన్నారం 88%, కాసిపేట 94%, కోటపల్లి 88%, లక్షెట్టిపేట 90%, మంచిర్యాల 96%, మందమర్రి 86%, తాండూరు 89%, వేమనపల్లి 88%, నస్పూర్ 98%, హాజీపూర్ 87%, భీమారం 88%, కన్నెపల్లి 87%, నెన్నెల 86 శాతం వరకు పంపిణీ పూర్తయింది.

**గడువు ముగిసింది, అవకాశం కోల్పోయినట్లేనా?**

రేషన్ పొందలేని లబ్ధిదారులకు మరో అవకాశం ఉంటుందా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ప్రస్తుతం మాత్రం సెప్టెంబర్ వరకు కొత్త పంపిణీ వచ్చే వరకు వారు వేచి చూడాల్సిందే. గతంలో నెలల వారీగా బియ్యం ఇవ్వడం వల్ల రేషన్ తీసుకోనివారు తదుపరి నెలలో పొందే వీలుండేది. కానీ మూడు నెలల పంపిణీ ఒకేసారి జరగడం వల్ల ఈసారి అటువంటి అవకాశం లేకుండాపోయింది. అధికారులు మళ్లీ అవకాశం కల్పిస్తారా, కేంద్రం నుంచి మళ్లీ ఆదేశాలు వస్తాయా అన్నదానిపై ఇప్పటిదాకా సమాచారం లేదు. దీంతో రేషన్ కార్డు ఉన్నా కూడా బియ్యం పొందలేని లబ్దిదారులు నష్టపోయినట్టే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**శెనార్తి మీడియా, పెద్దపల్లి:** ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెద్దపల్లి మండలం పెద్ద బొంకూరు గ్రామానికి చెందిన రమేష్ తనకు గ్రామ శివారు లో మొత్తం 2 ఎకరాల వ్యవసాయ భూమికి ఉందని, రైతు భరోసా అమలు కావడం లేదని దరఖాస్తు చేసుకోగా జిల్లా వ్యవసాయ అధికారికి రాశారు. రామగుండం మండలం కుందనపల్లి గ్రామానికి చెందిన వేల్పుల అనూష అర్హతలు ఉన్నప్పటికీ గృహ జ్యోతి పథకం అమలు కావడంలేదని, అమలు చేయాలని దరఖాస్తు చేసుకోగా విద్యుత్ శాఖ ఎస్ఈకి పరిశీలించాలని రాశారు. పెద్దపెల్లి పట్టణంలోని తాజ్ కాలనీ రోడ్డు కు చెందిన అస్మిత్ జహన్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

# ఘనంగా స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ కాసిపేట గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల అకడమిక్ యాక్టివిటీలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నికల కోసం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ కుమార్ ఎన్నికల ఉద్దేశాన్ని తెలియజేస్తూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కెప్టెన్, వైస్ కెప్టెన్ పదవుల కోసం నలుగురు విద్యార్థులు బరిలో నిలిచారు. వారికి ప్రత్యేక చిహ్నాలను కేటాయించి నామినేషన్ దాఖలు, తిరస్కరణ ప్రక్రియను రిటర్నింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఓటింగ్ ప్రక్రియను పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిసైడింగ్ ఆఫీసర్, పోలింగ్ ఆఫీసర్లు సమర్థంగా నిర్వహించారు. ఓటు వేసిన విద్యార్థుల చూపుడు వేళ్లపై సిరా గుర్తు పెట్టి ఎన్నికల నిబంధనలు పాటించారు. ఫలితాలను ప్రకటించే ముందు ఓట్ల లెక్కింపును విద్యార్థులే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్ల గురజాల ఎస్సై రమేష్, ఏఎస్ఐ అలీ విచ్చేసి ఓటింగ్ సరళిని పరిశీలించి విద్యార్థులకు ప్రాముఖ్యమైన సూచనలు చేశారు. ఉపాధ్యాయులు రమేష్, పి. నరేందర్, ఎ. శైలజ, ఎల్. శ్రీనివాస్, ఎస్. మంజుల తదితరులు విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌కు సన్మానం



**శెనార్తి మీడియా, కరీంనగర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ సీనియర్ అసిస్టెంట్ పోగునూరు రవీంధర్ పదవి విరమణ సందర్భంగా సోమవారం సన్మాన కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్లు ఖాధర్, వేణుమాధవ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. రవీంధర్ దంపతులను శాలువాలతో సత్కరించి బెనిఫిట్స్ సర్టిఫికేట్, బహుమతి అందజేశారు. అనంతరం నగరపాలక సంస్థ వాహనంలో ఆయనను నివాసానికి పంపించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నర్సయ్య, సూపరింటెండెంట్ సునీల్, క్యాషియర్ వెంకటేష్, సూపరింటెండెంట్ సంజీవ్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# పర్యావరణ క్విజ్ పోటీ గోడప్రతుల ఆవిష్కరణ



**శెనార్తి మీడియా, నిర్మల్**

జిల్లాలో విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో భాగంగా నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటీషన్ (ఎన్ఎస్‌పిసి) కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులతో కలిసి గోడప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూలై 1 నుండి ఆగస్టు 21 వరకు పర్యావరణ పరిరక్షణ అంశంపై జిల్లాలో క్విజ్ పోటీలు నిర్వహించబడతాయని, ఆగస్టు 30న ఫలితాలు ప్రకటించబడతాయని తెలిపారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకొని, భవిష్యత్తులో బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు ప్రేరణ పొందుతారని చెప్పారు.జిల్లాలో పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులందరినీ ఈ పోటీల్లో చేర్చాలని అధికారులకు సూచించారు. విద్యార్థులలో సైన్స్, పర్యావరణ శ్రద్ధను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించగలరని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, సైన్స్ అధికారి వినోద్, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త మోహన్ రావు, నర్సయ్య, ఎస్టియు రాష్ట్ర బాధ్యులు గజేందర్, జిల్లా బాధ్యులు భూమన్న యాదవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


## మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం




**శెనార్తి మీడియా, కరీంనగర్:** భారత దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెట్టే విధానాలను నిరసిస్తూ జూలై 2న ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంపై ముట్టడి నిర్వహించబోతున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మోదీపై తీవ్ర విమర్శలు చేశారు.మోదీ, ట్రంప్ లాంటి విదేశీ నేతలతో ప్రతిష్టారాజకీయాలు చేస్తూ, దేశ యువతకు అవసరమైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమవుతున్నారని యుగంధర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రతిష్టను తాకట్టు పెడుతూ, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోందని తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు కనకం ప్రవీణ్, వినయ్, చరణ్ పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎస్బీఐ 70వ వార్షికోత్సవం

**జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు ప్రారంభం**



**శెనార్తి మీడియా, నిర్మల్**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తన 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లాలోని అన్ని 19 ఎస్బీఐ శాఖల ఆధ్వర్యంలో విస్తృతమైన సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్ గోపాల్ ప్రకటించారు.1955 జూలై 1న ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మారిన ఎస్బీఐ, దేశవ్యాప్తంగా 22,970 శాఖలతో భారతదేశంలోనే అతిపెద్ద బ్యాంకుగా ఎదిగిందని రామ్ గోపాల్ తెలిపారు. వినియోగదారుల కోసం సురక్షితమైన, వేగవంతమైన, విశ్వసనీయ సేవలను అందించడమే తమ ప్రాధాన్యమని, "ప్యూర్ బ్యాంకింగ్, నథింగ్ ఎల్స్" అనే నినాదంతో బ్యాంక్ సామాజిక సేవకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

**సేవా కార్యక్రమాల వివరాలు..**

70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు, అనాథాశ్రమాలకు వస్తు సామగ్రి పంపిణీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద రోగులకు అవసరమైన సాయం అందించటం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సేవా కార్యక్రమాల ద్వారా బ్యాంక్ ప్రజలకు తన సామాజిక బాధ్యతను నిలబెట్టుకుంటుందని వెల్లడించారు.

**ప్రజల విశ్వాసానికి మూలం..**

70 ఏళ్లుగా ప్రజల విశ్వాసం, సహకారంతో ఎస్బీఐ నడుస్తోందని, భవిష్యత్తులోనూ ఇదే విధంగా సేవలను కొనసాగించేందుకు బ్యాంక్ కట్టుబడి ఉందని రామ్ గోపాల్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలకు ఎస్బీఐ బ్రాంచ్ అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

## పీఎం బీమాపై అవగాహన కల్పించాలి:

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**శెనార్తి మీడియా, కరీంనగర్:** ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్షా బీమా యోజన, అతల్ పెన్షన్ యోజనలాంటి పథకాలను ప్రతి ఒక్కరికి చేరువ చేసి, ప్రతి కుటుంబానికి బీమా కవర్ కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు, బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు.తక్కువ ప్రీమియంతో రెండు లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యం అందించే పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. 17 నుండి 70 ఏళ్ల వరకు అర్హులైనవారు ఈ బీమా పథకాలకు లబ్ధిదారులుగా ఉండవచ్చని, ప్రమాదవశాత్తు మరణం సంభవించినప్పుడు ఈ బీమా కుటుంబానికి పెద్ద సహాయంగా ఉంటుందన్నారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు ఆన్‌లైన్ జూదం, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ వర్క్‌షాపులు నిర్వహించాలని, వాటికి బ్యాంకర్లు సహకరించాలని తెలిపారు. విద్యార్థులందరూ పీఎం బీమా పథకాల కోసం నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రధానమంత్రి సూరజ్ ఘర్ ముక్త్ బిజిలీ యోజన కింద ప్రతి జిల్లాలో ఒక రెవెన్యూ గ్రామాన్ని సోలార్ మోడల్ గ్రామంగా ఎంపిక చేసి, కోటి రూపాయల నిధు కేటాయించి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఐదువేల పైగా జనాభా ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంటికి, ప్రభుత్వ కార్యాలయాలకు సౌర విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు.మహిళా సంఘాల సభ్యులందరూ పదవ తరగతి, ఇంటర్ స్థాయి చదువులు కొనసాగించేలా ఓపెన్ స్కూల్ లో చేర్పించేందుకు ఎంపీడీవోలు, ఎంపీఓలు ప్రత్యేక చొరవ చూపించాలని సూచించారు.



# కోహ్లీ రికార్డుపై కన్నేసిన పంత్..

ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో, రిషబ్ పంత్ వరుసగా రెండు సెంచరీలు సాధించి అద్భుతమైన ఆటను కనబరిచాడు. 5 మ్యాచ్‌ల సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో అద్వితీయ స్కోరు సాధించిన తర్వాత, ఇప్పుడు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ రికార్డును బద్దలు కొట్టే అవకాశం అతనికి ఉంది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో రిషబ్ పంత్ సెంచరీ సాధిస్తే కోహ్లీ రికార్డు బ్రేక్ అవుతుంది. ఇంగ్లండ్‌పై అత్యధిక సెంచరీలు చేసిన టెస్ట్ రికార్డు ప్రమాదంలో ఉంది. భారత టెస్ట్ వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ విరాట్ కోహ్లీ పెద్ద రికార్డును దృష్టిలో ఉంచుకుని ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లోకి అడుగుపెడతాడు. లీడ్స్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు సాధించిన తర్వాత, రెండవ మ్యాచ్‌లో కూడా అతని నుండి ఇలాంటి ఆట ఆశించబడుతుంది. అయితే, ఈ సెంచరీ ఇన్నింగ్స్ భారత జట్టుకు విజయాన్ని అందించలేకపోయింది. 371 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఆతిథ్య ఇంగ్లాండ్ గెలిచింది. ఇంగ్లాండ్‌పై టెస్టుల్లో భారతదేశం తరపున అత్యధిక సెంచరీలు (ఐదు) చేసిన రెండవ ఆటగాడిగా కోహ్లీ ఉన్నాడు. పంత్ ఇంగ్లాండ్ పై ఐదు టెస్ట్ సెంచరీలు కూడా చేశాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో పంత్ మరో సెంచరీ చేస్తే, అతను కోహ్లీని మించిపోతాడు. 5 మ్యాచ్‌ల సిరీస్‌కు భారత జట్టు ఎంపిక కావడానికి ముందే విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పుడు అతను ఈ ఫార్మాట్‌లో ఆడటం కనిపించదు. ఇంగ్లాండ్‌పై టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన భారత ఆటగాళ్లలో అతను మహ్మద్ అజారుద్దీన్‌తో చేరతాడు. అదే సమయంలో, టీమ్ ఇండియా కొత్త టెస్ట్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ కూడా ప్రత్యేక రికార్డును సాధించడానికి దగ్గరగా ఉన్నాడు. అతను మరో సెంచరీ సాధిస్తే, ఇంగ్లాండ్ గడ్డపై భారత కెప్టెన్‌గా అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాళ్లలో అతను చేర్చబడతాడు. గిల్ తన పేరు మీద రెండు టెస్ట్ సెంచరీలు కలిగి ఉంటాడు. కోహ్లీ మరియు మహ్మద్ అజారుద్దీన్ తర్వాత ఇంగ్లాండ్‌లో రెండు సెంచరీలు సాధించిన భారత కెప్టెన్ అవుతాడు.తొలి టెస్టులో టీమిండియా రెగ్యులర్ స్పిన్నర్ లేకుండానే బరిలోకి దిగింది. అయితే రెండో టెస్టులో మాత్రం ప్రధాన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇస్తారని సమాచారం. అందులోనూ ఎడ్జ్ బాస్టన్ పిచ్‌పై టర్న్ లభిస్తుంది. దాంతో కుల్దీప్ యాదవ్ రాణించే అవకాశం ఉంది. అతడితో పాటు అర్ష్‌దీప్ సింగ్‌ను కూడా తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే అర్ష్‌దీప్ సింగ్ ను బుమ్రా స్థానంలో తీసుకుంటారా? లేదంటే మరో ప్లేయర్‌ను తప్పించి తీసుకుంటారా? అనేది తెలియాల్సి ఉంది. బుమ్రాకు రెండో టెస్టు నుంచి విశ్రాంతి కల్పిస్తారని జోరుగా ప్రచారం జరుగుతుంది. అయితే అతడు నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఇక పిచ్ విషయానికి వస్తే.. నాలుగో ఇన్నింగ్స్ కష్టంగా ఉంటుంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడ నాలుగు ఇన్నింగ్స్‌ల సగటును చూస్తే.. తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగులు.. రెండో ఇన్నింగ్స్ లో 280 పరుగులు.. మూడో ఇన్నింగ్స్‌లో 230 నుంచి 250 పరుగులు.. నాలుగో ఇన్నింగ్స్‌లో 170 నుంచి 200 పరుగుల మధ్య ఉంది.



# ఒకే ఫార్మాట్ కు వీడ్కోలు పలికా..

2024 టీ20 ప్రపంచ కప్ గెలిచి జూన్ 29 నాటికి భారత్ ఏడాది పూర్తి చేసుకుంది. బార్బడోస్‌లో జరిగిన ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను ఓడించి, 17ఏళ్ల తర్వాత టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. భారత జట్టు ప్రస్తుతం టెస్ట్ సిరీస్ కోసం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత ఆటగాళ్లు ఈ సందర్భాన్ని కేక్ కట్ చేసి హ్యాపీగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ విజయ వార్షికోత్సవ వేడుకలో రిషబ్ పంత్ రవీంద్ర జడేజా రిటైర్మెంట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడది నెట్టింట్లో వైరల్ గా మారింది. ఈ వేడుక వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ వీడియో ప్రకారం.. అందులో రెండు కేకులు ఆర్డర్ చేశారు. 1 నిమిషం 10 సెకన్ల వీడియోలో, టీ20 విజేత కెప్టెన్ రోహిత్ శర్మ అక్కడ లేకపోవడంతో మొదట్లో ఏ ఆటగాడు కేక్ కట్ చేయడానికి ముందుకు రాకపోవడాన్ని మనం చూడవచ్చు. అప్పుడు టోర్నమెంట్‌లో అత్యధికంగా 17 వికెట్లు తీసిన అర్ష్‌దీప్ సింగ్ ముందుకు వచ్చాడు. కానీ బుమ్రా ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అని గుర్తు చేసిన వెంటనే, బుమ్రా, సిరాజ్ కలిసి కేక్ కట్ చేశారు. దీని తర్వాత ఆటగాళ్లందరూ ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ సందడి చేశారు. అంతేకాదు బౌలింగ్ కోచ్ టి దిలీప్‌కు తినిపించారు. అయితే ఈ వీడియోలోని ఒక ఫన్నీ సన్నివేశాం చోటుచేసుకుంది. బుమ్రా, పంత్ జడేజాకు కేక్ తినిపించి హ్యాపీ రిటైర్మెంట్ అని చెప్పారు. దానికి జడేజా నవ్వుతూ తాను ఒకే ఫార్మాట్ కు వీడ్కోలు పలికానంటూ స్పష్టం చేశారు. ప్రపంచ కప్ గెలిచిన తర్వాత, జడేజా, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ %ు%20 ఫార్మాట్ నుండి రిటైర్ అయ్యారు. రోహిత్ , కోహ్లీ ఇప్పుడు టెస్ట్ క్రికెట్ నుండి కూడా రిటైర్ అయిన సంగతి తెలిసిందే. అయితే తాను ఒకే ఫార్మాట్ నుండి రిటైర్ అయ్యానని పంత్ చేసిన ప్రకటనకు జడేజా నవ్వుతూ సమాధానం ఇచ్చారు. ఈ ముగ్గురితో పాటు భారత జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ కూడా టీం ఇండియా పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మొత్తానికి ఈ ఫన్నీ వీడియో కాస్త నెట్టింట్లో వైరల్ అవుతోంది. కాగా భారత్-ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో రెండో మ్యాచ్ జూలై 2 నుండి ఎడ్జ్‌బాస్టన్‌లో జరగనుంది. తొలి మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత భారత్ 0-1తో వెనుకబడి ఉంది. ఫ్పుడు రెండో టెస్ట్‌ను గెలవడం ద్వారా సిరీస్‌ను సమం చేయడానికి ప్రయత్నిస్తుంది. అయితే, ఇప్పటివరకు ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన 7 మ్యాచ్‌లలో భారత్ ఒక్కసారి కూడా గెలవలేదు, కాబట్టి టీమ్ ఇండియా దాని కొత్తకెప్టెన్ శుభ్‌మాన్ గిల్ డబుల్ సవాలును ఎదుర్కోవలసి ఉంటుంది.

# ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌కు సాయి సుదర్శన్ దూరం!!

టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీ భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరుగుతోంది. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఇంగ్లాండ్ గెలిచింది. ఆ తర్వాత ఇంగ్లీష్ జట్టు సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉంది. లీడ్స్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో సాయి సుదర్శన్ టీమ్ ఇండియా తరపున అరంగేట్రం చేశాడు. కానీ, రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతను విఫలమైంది. ఆ తర్వాత రెండవ మ్యాచ్ ఎడ్జ్‌బాస్టన్‌లో జరగనుంది.ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే ఈ మ్యాచ్‌లో సాయి సుదర్శన్‌ను తొలగించే అవకాశం ఉంది. యువ బ్యాట్స్‌మన్ స్థానంలో మాజీ క్రికెటర్ కొడుకుకు ఆడే అవకాశం లభించవచ్చు. ఎడ్జ్‌బాస్టన్‌లో ఇప్పటివరకు టీమ్ ఇండియా ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా గెలవలేదు. ఇటువంటి పరిస్థితిలో, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన ప్రత్యేక ఆటగాడికి అవకాశం ఇవ్వడం ద్వారా చరిత్రను మార్చడానికి ప్రయత్నించవచ్చు. భారత్, ఇంగ్లాండ్ మధ్య 5 మ్యాచ్‌ల సిరీస్ జరుగుతోంది. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో భారత జట్టు 5 వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఇప్పుడు భారత జట్టు ఎడ్జ్‌బాస్టన్‌లో ఆడటానికి సిద్ధంగా ఉంది. భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సాయి సుదర్శన్‌కు ప్లేయింగ్-11 నుంచి తప్పించే ఛాన్స్ ఉంది. సాయి సుదర్శన్ తన తొలి మ్యాచ్‌లో ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయాడు. లీడ్స్ మైదానంలో జరిగిన మొదటి ఇన్నింగ్స్‌లో నాల్గవ బంతికి అతను సున్నా వద్ద ఔటయ్యాడు. రెండవ ఇన్నింగ్స్‌లో కూడా అతను 48 బంతుల్లో 30 పరుగులు మాత్రమే చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో సాయి 4 ఫోర్లు కొట్టాడు. అతనికి నంబర్-3 స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం లభించింది. కానీ త్వరగా అవుట్ కావడంతో, జట్టుపై ఒత్తిడి పెరిగింది. దీని కారణంగా సాయి సుదర్శన్‌ను ఎడ్జ్‌బాస్టన్‌లో ప్లేయింగ్-11 నుంచి తొలగించవచ్చని చెప్పవచ్చు. ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్ సాయి సుదర్శన్ స్థానంలో ఇండియా



ఎ కెప్టెన్‌గా ఉన్న అభిమన్యు ఈశ్వరన్‌కు గౌతమ్ గంభీర్ అవకాశం ఇవ్వవచ్చు. ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లో అభిమన్యు ఈశ్వరన్ రెండు హాఫ్ సెంచరీలు సాధించాడు. ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన రెండవ అనధికారిక మ్యాచ్‌లో, ప్రతికూల పరిస్థితుల్లో 92 బంతుల్లో 80 పరుగులు చేశాడు.కానీ, ఆ తర్వాత అతను డెహ్రాడూ-న్‌లో భూమిని కొని క్రికెట్ స్టేడియం నిర్మించాడు. దానికి తన కొడుకు పేరు మీద అభిమన్యు క్రికెట్ అకాడమీ అని పేరు పెట్టాడు. ఒక ఇంటర్వ్యూలో, అభిమన్యు ఈశ్వరన్ తండ్రి, “నేను డెహ్రాడూన్‌లో వార్తాపత్రికలు పంపిణీ చేసేవాడిని, ఐస్ క్రీం అమ్మేవాడిని. నేను %జూ% డిగ్రీ పూర్తి చేసినప్పుడు, క్రీడకు ఏదైనా తిరిగి ఇవ్వాలనుకున్నాను. దేవుడు నాకు క్రికెట్ ఆడే కొడుకును ఇవ్వడం నా అదృష్టం” అని చెప్పుకొచ్చాడు. గత కొన్ని సిరీస్‌లకు అభిమన్యు ఈశ్వరన్‌కు టెస్ట్ జట్టులో అవకాశం లభించింది. కానీ, అతనికి అరంగేట్రం చేసే అవకాశం రాలేదు. లీడ్స్ టెస్ట్‌లో అభిమన్యు కంటే ముందు సాయి సుదర్శన్‌కు అవకాశం ఇచ్చినందుకు కెప్టెన్ గిల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సోషల్ మీడియాలో చాలా ట్రోల్ అయ్యాడు. కానీ, ఇప్పుడు అతనికి ఎడ్జ్‌బాస్టన్‌లో అవకాశం లభించే అవకాశం ఉంది.ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపికైన జట్టులో, అభిమన్యు ఈశ్వరన్ అత్యధిక ఫస్ట్ క్లాస్ సెంచరీలు సాధించాడు. అతను 103 మ్యాచ్‌ల్లో 7841 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అతను 27 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు చేశాడు. అతని సగటు 48.70. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కరుణ్ నాయర్ 24 సెంచరీలు సాధించగా, కేఎల్ రాహుల్ 19 సెంచరీలు, సాయి సుదర్శన్ 7 సెంచరీలు సాధించారు.

ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్ బరిలో నిలిచే టీమిండియా ప్రాబబుల్ ప్లేయింగ్ 11:

కేఎల్ రాహుల్, యశస్వీ జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, శుభమన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్/వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ.

# మరో రికార్డును బద్దలు కొట్టనున్న యశస్వి జైస్వాల్



జూలై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండవ టెస్ట్ ప్రారంభం కానుంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని జట్టు టెస్ట్ సిరీస్‌లో 0-1తో వెనుకంజలో ఉంది. తప్పులను నుంచి నేర్చుకుని, జట్టు రెండవ టెస్ట్‌లో విజయంతో కమ్ బ్యాక్ చేయాలని భావిస్తోంది. మొదటి టెస్ట్‌లో సెంచరీ సాధించిన యశస్వి జై-స్వాల్ ప్రపంచ రికార్డు సృష్టించే దిశగా అడుగులు వేస్తున్నాడు.లీడ్స్ లో జరిగిన తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ 101 పరుగులు చేశాడు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 4 పరుగులు చేసి అవుటయ్యాడు. కానీ మంచి ఫావ్-ంలో కనిపిస్తున్నాడు. ఇదే ఊపులో పాకిస్తాన్ మాజీ బ్యాటర్ షాహిద్ అఫ్రిది ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడానికి సిద్ధంగా ఉన్నాడు. టెస్టు క్రికెట్లో అత్యంత వేగంగా 50 సిక్సర్లు బాదిన రికార్డు పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది పేరిట ఉంది. అతడు 46 ఇన్నింగ్స్‌లలో టెస్ట్ క్రికెట్‌లో 50 సిక్సర్లు బాదేశాడు. యశస్వి జైస్వాల్ విషయానికి వస్తే, భారత టెస్ట్ క్రికెట్‌లో 38 ఇన్నింగ్స్‌లలో 40 సిక్సర్లు కొట్టాడు. అతను 10 సిక్సర్లు కొడితే విధ్వంసకర బ్యాటర్ అఫ్రిది ప్రపంచ రికార్డును బద్ధలుకొట్టి సరికొత్త లిఖించుకోవచ్చు.యశస్వి జైస్వాల్ టెస్ట్ రికార్డు ఇంగ్లండ్‌పై బాగానే ఉంది. అతను ఇప్పటివరకు 11 ఇన్నింగ్స్‌లలో 27 సిక్సర్లు కొట్టాడు. అతను ఒకే జట్టుపై అత్యధిక సిక్సర్లు కొట్టాడు. అతను రెండవ టెస్ట్‌లో కూడా 10 సిక్సర్లు కొట్టకపోయినా, అఫ్రిది రికార్డును బద్దలు కొట్టడానికి అవకాశం ఉంది. అఫ్రిది రికార్డును బద్దలు కొట్టాలంటే జైస్వాల్ తరువాత 7 ఇన్నింగ్స్‌లలో 10 సిక్సర్లు కొడితే సరి.టెస్ట్ క్రికెట్‌లో అత్యంత వేగంగా 50 సిక్సర్లు కొట్టిన రెండవ బ్యాటర్‌గా భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నాడు. ఇటీవల టెస్ట్ క్రికెట్ నుండి హిట్ మ్యాన్ రిటైర్మెంట్ తీసుకున్నాడు. అతను 51 ఇన్నింగ్స్‌లలో 50 టెస్టు సిక్సర్లను చేరుకున్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్‌ను యశస్వీ జైస్వాల్ దాటేయడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. జైస్వాల్ ఇప్పటివరకు టెస్టుల్లో 20 మ్యాచ్‌లలో 38 ఇన్నింగ్స్‌లలో 1903 పరుగులు చేశాడు. ఈ టెస్టులో రాణిస్తే అతను 2000 టెస్ట్ పరుగులు పూర్తి చేసుకుంటాడు. టెస్టుల్లో జైస్వాల్ ఇప్పటివరకు 5 సెంచరీలు, 10 అర్ధ సెంచరీలు సాధించాడు.భారత్ ఇంతకు ముందు ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో 8 టెస్టులు ఆడగా, అందులో ఇంగ్లండ్ 7 గెలిచింది. 1 మ్యాచ్ డ్రాగా ముగిసింది. శుభ్‌మన్ గిల్ అండ్ టీమ్ ఈ టెస్ట్‌ను గెలిస్తే, ఈ స్టేడియంలో భారత్‌కు ఇదే తొలి విజయం కానుంది. తొలి టెస్టులో భారత్ నుంచి 5 శతకాలు నమోదైనా.. లోయర్ ఆర్డర్ అంతగా రాణించకపోవడం, కరుణ్ నాయర్, జడేజా బ్యాటింగ్ లో స్కోరు చేయకపోవడం జట్టుకు మైనస్ అయ్యాయి. బౌలింగ్ అటాక్ అంత స్ట్రాంగ్ గా కనిపించడం లేదు. జస్ప్రిత్ బుమ్రా పర్వాలేదనిపిస్తున్నాడు. రెండో టెస్టులో భారీ మార్పులతో టీమిండియా బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది.

# డీపీఎల్ రెండో సీజన్ కోసం సన్నాహాలు

## అరంగేట్రం చేయనున్న కోహ్లీ, సెహ్వాగ్ వారసులు



ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2024లో ప్రారంభమైంది. ఇప్పుడు రెండో సీజన్ కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2025 వేలం శనివారం, జులై 5న జరగనుంది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ వేలం జాబితా చాలా ఆసక్తికరంగా ఉంది. వేలం జాబితాలో విరాట్ కోహ్లీ అన్న కొడుకు పేరు కూడా ఉంది. అంతే కాకుండా దిగ్గజ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కొడుకులు కూడా వేలం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరేంద్ర సెహ్వాగ్ కొడుకు, విరాట్ కోహ్లీ అన్న కొడుకు పేరు కూడా ఆర్యవీర్ కావడం చాలా ఆసక్తికరమైన విషయం. 15 ఏళ్ల ఆర్యవీర్ కోహ్లీ.. విరాట్ కోహ్లీ అన్నయ్య వికాస్ కోహ్లీ కొడుకు. ఆర్యవీర్ ఒక లెగ్ స్పిన్ బౌలర్. ఆర్యవీర్ కోహ్లీ విరాట్ కోహ్లీ చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో వెస్ట్ ఢిల్లీ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఆర్యవీర్ కోహ్లీని వేలం జాబితాలోని కేటగిరీ సీలో ఉంచారు. గత సీజన్‌లో ఆర్యవీర్ కోహ్లీ ఢిల్లీ అండర్-16 జట్టు కోసం నామినేట్ చేయబడింది. ఢిల్లీ క్రికెట్‌లో నామినేట్ అయిన ఆటగాళ్లు 30 మందితో కూడిన తుది జట్టులో స్థానం సంపాదించిన వారు. అదే విధంగా వీరేంద్ర సెహ్వాగ్ 17 ఏళ్ల కొడుకు ఆర్యవీర్ సెహ్వాగ్ కూడా వేలం జాబితాలో ఉన్నాడు. అతడిని కేటగిరీ బీలో ఉంచారు. ఆర్యవీర్ సెహ్వాగ్ ఢిల్లీ అండర్-19 జట్టు తరఫున ఆడాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ మేఘాలయపై 297 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. వీరేంద్ర సెహ్వాగ్ చిన్న కొడుకు వేదాంత్ సెహ్వాగ్‌ను కూడా కేటగిరీ బీలో ఉంచారు. వేదాంత్ ఢిల్లీ తరఫున అండర్-16 క్రికెట్ ఆడాడు.ఈ సారి ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో మొత్తం 8 జట్లు పాల్గొననున్నాయి. గత సీజన్‌తో పోలిస్తే ఈ సారి ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో 2 కొత్త జట్లు ప్రవేశించనున్నాయి. ఈ 8 జట్ల పేర్లు ఈస్ట్ ఢిల్లీ రైడర్స్, నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్, వెస్ట్ ఢిల్లీ లయన్స్, సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్, పురానీ ఢిల్లీ 6, సెంట్రల్ ఢిల్లీ కింగ్స్.. 2 కొత్త జట్ల పేర్లు అవుటర్ ఢిల్లీ, న్యూ ఢిల్లీగా ఉన్నాయి.



# కేశవ్ మహరాజ్ డబుల్ సెంచరీ

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 628 వికెట్లు తీసిన సౌతాఫ్రికా స్టార్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ అరుదైన ఘనతను సాధించాడు. టెస్ట్ ఫార్మాట్‌లో 200 వికెట్లు తీసి ఔరా అనిపించాడు. ఈ ఘనత సాధించిన దక్షిణాఫ్రికా తరపున తొలి బౌలర్‌గా నిలిచాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే మధ్య జరిగిన తొలి టెస్టులో ఈ స్పిన్నర్ చరిత్ర సృష్టించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 418/9 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన దక్షిణాఫ్రికా, అద్భుతమైన బౌలింగ్ ద్వారా రెండో రోజు జింబాబ్వేను 251 పరుగులకు ఆలౌట్ చేసి 167 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. టెంబా బావుమా గాయపడటంతో దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా కేశవ్ మహారాజ్ ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసి మహారాజ్ పెద్ద రికార్డు సృష్టించాడు. వియాన్ ముల్డర్ నాలుగు వికెట్లు తీసి జింబాబ్వే పతనాన్ని శాసించాడు. అరంగేట్రం చేసిన కోడి యూసుఫ్, కేశవ్ మహారాజ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఈ వికెట్లతో, కేశవ్ మహారాజ్ టెస్ట్ క్రికెట్‌లో డబుల్ సెంచరీ వికెట్లు పూర్తి చేశాడు. అతను టెస్టుల్లో 200 వికెట్లు పూర్తి చేశాడు. దక్షిణాఫ్రికా తరపున ఈ ఘనత సాధించిన దేశం నుండి మొదటి స్పిన్నర్ అయ్యాడు. మహారాజ్ 16.4 ఓవర్లలో 70 పరుగులకు 3 వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికా తరపున టెస్ట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఇప్పటికే నిలిచాడు. కేశవ్ మహరాజ్ హనుమాన్ భక్తుడు. వికెట్ తీసిన ప్రతిసారి అతడు దేవుడిని మొక్కడం ఆనవాయితీ. 2016లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో మహారాజ్ తన అరంగేట్రం చేశాడు. అప్పటి నుండి ఈ ఫార్మాట్‌లో క్రమం తప్పకుండా ఆడుతున్నాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో చాలా కాలం పాటు కష్టపడి పనిచేసిన తర్వాత, అతనికి జాతీయ జట్టులో అవకాశం లభించింది. ఈ ఫార్మాట్‌లో అతడు 628 వికెట్లు సాధించాడు. దక్షిణాఫ్రికా అత్యుత్తమ స్పిన్నర్. వికెట్ల పరంగా దక్షిణాఫ్రికాకు చెందిన రెండవ అత్యంత విజయవంతమైన స్పిన్నర్ హ్యూ టేఫీల్డ్. ఈ జాబితాలో పాల్ ఆడమ్స్ మూడవ స్థానంలో ఉన్నారు. పాల్ హారిస్, నిక్కీ బోజే నాలుగు, ఐదవ స్థానంలో ఉన్నారు.


# బోల్డ్ కంటెంటు..
# నో ఆబ్జెక్షన్



థై సొగసులు ఆవిష్కరిస్తూ కొంటె చూపులు క్యూట్ లుక్స్ కుర్రకారు హృదయాలను గెలుచుకున్న యంగ్ బ్యూటీ త్రిధా చౌదరి..


హిందీ, బెంగాళీ, తెలుగు చిత్రాల్లో నటిస్తున్న ఈ భామ.. ఆశ్రమ్ వెబ్ సిరీస్లో హీటెక్కించే పెర్ఫామెన్సెస్తో మతులు చెడగొట్టింది. ఈ సిరీస్లో రెచ్చిపోయి బోల్డ్ సన్నివేశాల్లో నటించింది. ఇప్పటికే అరడజను పైగా వెబ్ సిరీస్ లలో నటించి తన ప్రతిభను నిరూపించింది. సినిమాల పరంగా బోల్డ్ కంటెంట్ కి అభ్యంతరం చెప్పని భామగా గుర్తింపు పొందింది. మరోవైపు త్రిధా వరుస ఫొటోషూట్లు ఇన్ స్టాలోనూ క్రేజీగా మారాయి. ఈ క్యూటీ గ్లామర్ ఎలివేషన్ కి ఎంతమాత్రం అభ్యంతరం చెప్పదు. తాజా ఫొటోషూట్ లో త్రిధా ఫూల్ సైడ్ అర్ధనగ్నంగా కనిపించింది. కొలనులో ఈదేందుకు సిద్ధమైన త్రిధా.. థై సొగసులను ఆవిష్కరిస్తూ కొంటెగా ఫోజులిచ్చింది.

# బీచ్‌లో సిస్టర్స్ రచ్చ రచ్చ




టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో కాజల్ అగర్వాల్ ఒకరు అనడంలో సందేహం లేదు. సుదీర్ఘ కాలంగా కాజల్ అగర్వాల్ టాలీవుడ్‌లో కొనసాగుతోంది. గత రెండు మూడు సంవత్సరాలుగా కాజల్ సినిమాలు తగ్గాయి, కానీ ఆమెకు ఉన్న క్రేజ్ మాత్రం తగ్గలేదు. పెళ్లి చేసుకుని, తల్లి అయిన తర్వాత కూడా ముందులా నటించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ టాలీవుడ్‌లో ఆమెకు మునుపటి మాదిరిగా సినిమా ఆఫర్లు రావడం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి ఉన్న గౌరవం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరోయిన్‌గా కాజల్ చేసిన ఎన్నో సినిమాలు సూపర్ డూపర్ హిట్‌గా నిలిచాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల్లోనూ నటించి మెప్పించిన ముద్దుగుమ్మ కాజల్ అగర్వాల్ అనే విషయం తెల్సిందే. ఇటీవల మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప' సినిమాలోనూ అత్యంత కీలకమైన పార్వతిదేవి పాత్రలో కాజల్ అగర్వాల్ నటించి మెప్పించింది. ఈ మధ్య కాలంలో లీడ్ రోల్స్ కాకుండా ఇలా గెస్ట్ అప్పియరెన్స్ ఇస్తూ వస్తున్న కాజల్ అగర్వాల్ ఛాన్స్ లభిస్తే లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటించేందుకు, యాక్షన్ సీన్స్ కు కూడా రెడీ అన్నట్లుగా చెప్పుకొచ్చింది. హీరోయిన్‌గా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న కాజల్ అగర్వాల్ ఇప్పటికీ అదే అందం, అదే ఫిజిక్‌తో చూపు తిప్పుకోనివ్వడం లేదు. తాజాగా మరోసారి కాజల్ అగర్వాల్ ఫోటోలు ఇన్‌స్టాలో వైరల్ అవుతున్నాయి. ఈసారి ఆమె సిస్టర్ నిషా అగర్వాల్‌తో ఉన్న ఫోటోలు కావడంతో పాటు బీచ్‌లో బికినీలో ఉండటంతో మరింతగా చూపు ఆకర్షిస్తున్నాయి.ల కాజల్ అగర్వాల్ పుట్టిన రోజు సందర్భంగా ట్రిప్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ ట్రిప్‌లో తీసుకున్న ఫోటోలను అప్పుడప్పుడు షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా నిషా అగర్వాల్ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. కాజల్ అగర్వాల్‌కి బీచ్‌లో కూర్చుని ముద్దు పెట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇద్దరు సిస్టర్స్ బీచ్‌లో బికినీలో ఉన్నారు. సాధారణంగానే ముద్దుగుమ్మలు బీచ్‌లో బికినీలో ఉంటే చూపు తిప్పడం కష్టం. అలాంటిది ఇద్దరు సిస్టర్స్ బికినీలో ఉండటంతో చూపు తిప్పలేక పోతున్నాం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ మాత్రమే కాకుండా నిషా అగర్వాల్ కూడా చాలా అందంగా ఉందని నెట్టింట కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# బికినీలో పాలక్ చిల్లింగ్ మోడ్



బుల్లితెర నటి శ్వేతా తివారీ కుమార్తె పాలక్ తివారీ ప్రస్తుతం తన బోల్డ్ ఫోటోషూట్లతో యువతను ఆకట్టుకుంటోంది. పాలక్, సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రాహీం అలీఖాన్‌తో డేటింగ్ చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి షికార్ల ఫొటోలు గతంలో వైరల్ అయ్యాయి.తాజాగా పాలక్ తల్లి శ్వేతా తివారీతో విహారయాత్రలో ఉంది. ఈ సందర్భంగా తల్లీకూతుళ్లు బికినీల్లో దిగిన ఫొటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. శ్వేతా బ్లాక్ అండ్ వైట్ బికినీలో, పాలక్ రెడ్ అండ్ వైట్ బికినీలో కనిపించారు. ఈ ఫొటోలపై నెటిజన్లు విస్తృతంగా కామెంట్లు చేస్తుండగా, పాలక్ తన పోస్ట్‌లో కామెంట్ల విభాగాన్ని నిలిపివేసింది. దీంతో శ్వేతా పోస్ట్‌లలో యూత్ స్పందిస్తున్నారు.సల్మాన్‌ఖాన్ చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన పాలక్ కెరీర్ ఆశించిన స్థాయిలో సాగలేదు. తాజాగా 'ది భూత్నీ' అనే హారర్ కామెడీ విడుదలైంది. మరోవైపు, టాలీవుడ్ అగ్ర నిర్మాతల దృష్టిని ఆకర్షించేందుకు పాలక్ ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

# జూలై 11న మిరపకాయ్ రీ రిలీజ్



మాస్ మహారాజ రవితేజ మళ్లీ తన అభిమానులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీని అందించేందుకు రెడీ అయ్యాడు. రవితేజ నటించిన 'మిరపకాయ్' మూవీ గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించగా, ఈ సినిమాలో రవితేజ యాక్టింగ్‌కు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇప్పుడు ఈ సినిమాను రీ-రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. జులై 11న 'మిరపకాయ్' చిత్రాన్ని రీ-రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. హనుమాన్ మీడియా ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు, ఈ సినిమాలో అందాల భామ రిచా గంగోపాధ్యాయ్, దీక్షా సేత్ హీరోయిన్లుగా నటించగా, రమేష్ పుప్పల ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశారు. థమన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. 'మిరపకాయ్' మూవీ రీ-రిలీజ్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమాలో హీరోయిన్స్‌తో పాటు ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది మరో క్యారెక్టర్.. రిచా గంగోపాధ్యాయ్ ఫ్రెండ్ పాత్రలో కనిపించిన స్నిగ్ధ. నటనా శైలితో పాటు తన ప్రత్యేకమైన వాయిస్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న స్నిగ్ధ, అప్పట్లో బాగా పాపులర్ అయ్యింది. తాజాగా 'మిరపకాయ్' రీ-రిస్ట్ ప్రకటన వెలువడిన నేపథ్యంలో, స్నిగ్ధ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'మాస్ రాజా రవితేజ కుమ్మేసిన బ్లాక్‌బస్టర్ 'మిరపకాయ్' మళ్లీ థియేటర్లలోకి వస్తోంది. తప్పకుండా చూడండి!' అంటూ ఆమె ఓ పోస్ట్ కూడా చేసింది. అయితే ఆమె పూర్తిగా గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.



# అల్లరి నరేశ్ ఆల్కహాల్ మూవీ

టాలీవుడ్‌లో మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్స్‌లో అల్లరి నరేష్ కూడా ఒకరు. నటన పరంగా ప్రాణం పెట్టి ప్రేక్షకులకి మంచి వినోదం పంచేందుకు ఎంతో ప్రయత్నిస్తుంటారు. తన నటనతో ఎంత నవ్వించగలడో అంతే రీతిలో ఏడిపించగలడు ఈ అల్లరోడు. ఒకప్పుడు కామెడీ సినిమాలే చేసిన అల్లరి నరేష్ ఇప్పుడు జానర్ మార్చి సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్నాడు. ఇప్పుడు అల్లరి నరేష్ తన 63వ సినిమాతో బిజీగా ఉండగా, ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. అల్లరి నరేష్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను విభిన్న కథలతో విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నాడు. నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన మెహర్ తేజ్ దర్శకత్వంలో ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఇది అల్లరి నరేష్ కెరీర్‌లో 63వ చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ రోజు అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా, సినిమా యూనిట్ టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్‌లో నరేష్ ఆల్కహాలిజం లో మునిగి పోయినట్టుగా కనిపిస్తున్నారు. ఇది ఒక భ్రమ, వాస్తవికత మధ్య నడిచే కథ అని అర్థమవుతోంది. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ మరియు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రుహాని శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుండగా, గిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. వివిధ భావోద్వేగాలతో నిండి ఉండే ఈ సినిమా, అల్లరి నరేష్‌కి మరో హిట్‌గా నిలవనుందని సినీ వర్గాలు ఆశిస్తున్నారు.ఇక ఈ రోజు అల్లరి నరేష్ బర్త్ డే కాగా, ఆయనకి సోషల్ మీడియాలో అభిమానుల నుండే కాక సినీ ప్రముఖుల నుండి కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

Printed, Published and Owned by **V SAMPATH**, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**